ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

ఆదివారం | 08 నవంబరు, 2026 | పేజీలు : 08

వైద్యుల నిర్లక్ష్యానికి బాలింత మృతి



ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్: హనుమకొండ ప్రసూతి ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యానికి బాలింత మృతి చెందిన విషాద ఘటన శనివారం చోటు చేసుకున్నది. స్టేషన్ ఘన్‌పూర్ మండలం, పాంనూరు గ్రామానికి చెందిన పొన్న రమ్య.. ప్రసవం కోసం ఆసుపత్రికి తరలించగా ఆడ శిశువుకి జన్మనిచ్చిన రెండు గంటలకే.. అధిక రక్తస్రావంతో ఉదయం 4 గంటలకు పొన్న రమ్య మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. రక్తస్రావం సమయంలో డ్యూటీలో జూనియర్ డాక్టర్ మాత్రమే ఉన్నారని రమ్య కుటుంబ సభ్యులు చెబుతున్నారు. సకాలంలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతోనే రమ్య మృతి చెందిందని బంధువులు ఆరోపణలు చేస్తున్నారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే రమ్య చనిపోయిందంటూ ఆమే కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు.

మానసిక దివ్యాంగ చిన్నారులతో దీపావళి వేడుకలు

ఎంపి కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరికి శుభాకాంక్షలు తెలిపిన మానసిక దివ్యాంగ చిన్నారులు



ప్రజాపక్షం/హనుమకొండ టౌన్: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని హనుమకొండ మల్లికాంబ మనోవికాస కేంద్రానికి చెందిన మానసిక దివ్యాంగ చిన్నారులతో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి దీపావళి వేడుకలు జరుపుకున్నారు. శనివారం హనుమకొండ కనకదుర్గ కాలనీలోని వారి నివాసంలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారిని చిన్నారులు కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు చిన్నారులను ఆప్యాయంగా పలకరించారు. చిన్నారులకు స్వయంగా స్వీట్లు తినిపించి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.



ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు పటిష్ట కార్యాచరణ

11 నుంచి గ్రామసభల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలి
మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

ప్రజాపక్షం/మెదక్: ఎల్ నినో ప్రభావంతో ఎదురయ్యే వాతావరణ మార్పులు, వర్షాభావం, నీటి ఎద్దడి సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పటిష్ట కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీ నుంచి జిల్లాలోని అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి, ఎల్ నినో ప్రభావం, నీటి సంరక్షణ, వర్షపు నీటి నిల్వ, ప్రత్యామ్నాయ పంట విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కుటుంబాల్లో దీపావళి పండుగ సంతోషంగా జరిగేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఇళ్ల నిర్మాణ పనులను పర్యవేక్షిస్తూ అవసరమైన సహకారం అందించాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, జెడ్‌పి సిఇఒ ఎల్లయ్య, డిఆర్‌డిఒ శ్రీనివాసరావు, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, వ్యవసాయ శాఖ అధికారి దేవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ సాంకేతికతను ఉపయోగించి ప్రభుత్వ సేవలు వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

ప్రజాపక్షం/భూపాలపల్లి: వ్యవసాయ రంగంలో డిజిటల్ సాంకేతికతను వినియోగించుకొని రైతులకు ప్రభుత్వ సేవలను మరింత వేగంగా, పారదర్శకంగా అందించేందుకు అగ్రి స్టాక్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. శనివారం ఐడిఓసి కార్యాలయంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశంలో డిజిటల్ అగ్రికల్చర్ మిషన్‌లో భాగంగా అమలు చేస్తున్న అగ్రి స్టాక్ ప్రాజెక్టుపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అగ్రి స్టాక్ అనేది రైతు కేంద్రంగా రూపొందించిన డిజిటల్ వ్యవసాయ మౌలిక సదుపాయాల వ్యవస్థ అని తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి రైతుకు ప్రత్యేకమైన ఫార్మర్ ఐడీ కేటాయించి, వారి భూ రికార్డులు, పంటల సాగు వివరాలు, పశుసంపద, ప్రభుత్వ పథకాల ద్వారా పొందుతున్న ప్రయోజనాలను అనుసంధానం చేయనున్నట్లు వివరించారు. దీంతో అర్హులైన రైతులను సులభంగా గుర్తించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వేగంగా అందించడంతో పాటు మధ్యవర్తుల ప్రమేయాన్ని తగ్గించవచ్చన్నారు. రైతులకు తక్కువ వడ్డీతో రుణాలు, నాణ్యమైన వ్యవసాయ ఉత్పాదకాలు, వ్యవసాయానికి సంబంధించిన స్థానిక సమాచారం, మార్కెట్ సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావడంలో ఈ వ్యవస్థ దోహదపడుతుందని పేర్కొన్నారు. అగ్రి స్టాక్‌లో మూడు ప్రధాన రిజిస్ట్రీలు ఉంటాయని మొదటిది రైతు రిజిస్ట్రీ. ఇందులో రైతుల వ్యక్తిగత వివరాలు, ప్రత్యేక ఫార్మర్ ఐడీ, భూ రికార్డులు, ప్రభుత్వ పథకాల లబ్ధి వివరాలు నమోదు చేస్తారు. రెండోది పంట సాగు రిజిస్ట్రీ, మొబైల్ ఆధారిత డిజిటల్ పంట సర్వే ద్వారా ప్రతి సీజన్‌లో రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను నమోదు చేస్తారు. మూడోది జియోరిఫరెన్స్డ్ గ్రాడెడ్ మ్యాప్ రిజిస్ట్రీ, ఇందులో భూముల ఖచ్చితమైన భౌగోళిక సమాచారాన్ని భూ రికార్డులతో అనుసంధానం చేస్తారు. వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకొని రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కుసుమకుమారి, పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, గిరిజన సంక్షేమ అధికారి నాగ సాగర్, పశు సంవర్ధక శాఖ ఏడీ డా వెంకన్న, సహకార అధికారి వాలియా నాయక్, ఉద్యాన అధికారి మణి, ఈడీఎం శ్రీకాంత్, డిఆర్‌డిఓ, మార్కెటింగ్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



విజయానికి ప్రతీక దీపావళి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



ప్రజాపక్షం/భూపాలపల్లి: చెడుపై మంచి సాధించిన విజయానికి, చీకటిపై వెలుగు సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి పండుగను జరుపుకుంటామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పేర్కొన్నారు. దీపావళి పండుగ సందర్భాన్ని పురస్కరించుకొని భూపాలపల్లి నియోజకవర్గ ప్రజలందరికీ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన వెలుగులు నింపాలని, ప్రతి ఇంటా సుఖ సంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.దీపావళి పండుగను ప్రజలందరూ కుటుంబ సభ్యులతో కలిసి ఆనందోత్సాహాలతో, ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని అధిక శబ్దం, వాయు కాలుష్యానికి కారణమయ్యే టపాసులకు దూరంగా ఉండాలని సూచించారు.

కాళేశ్వరం ఆలయానికి శని త్రయోదశి

ఆదాయం రూ.1.60 లక్షలు



ప్రజాపక్షం/కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలోని బాలాలయంలో శనివారం శని త్రయోదశి సందర్భంగా నవ గ్రహ పూజలు, కాలసర్పదోష పూజలలో భక్తుల తాకిడి పెరిగి సందడిగా మారింది.ఆలయంలో భక్తులు ఆచరించిన109 నవగ్రహ పూజలు, 42 కాలసర్ప పూజలు,20 అభిశేకాలు,ప్రసాదాలపై సుమారు రూ.1.60 లక్షల ఆదాయం వచ్చింది.

మేటీలకు విధులు, బాధ్యతలపై శిక్షణ



ప్రజాపక్షం/చిట్యాల: వివిజి రామ్ జీ పథకం అమలులో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల మేటీలకు శనివారం ఎంపిడిఓ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపిడిఓ సురేందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మేటీల విధులు, బాధ్యతలు, కూలీల హాజరు నమోదు, పనుల పర్యవేక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఎన్ఎంఎంఎస్ మొబైల్ యాప్ ద్వారా కూలీల హాజరు నమోదు చేయడం, ఫోటోలు అప్‌లోడ్ చేసే విధానాన్ని వివరించారు. క్షేత్రస్తాయిలో పనుల నిర్వహణ, కూలీల హాజరు పర్యవేక్షణలో మేటీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. నూతన విధానాలపై అవగాహన పెంచుకొని పనులు సజావుగా జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి శ్రీకాంత్, ఎండి అబ్దుల్ అలీం, ఈసీ సుధాకర్, స్రవంతి, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేటీలు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ...ఇద్దరి అరెస్టు

రూ.1.06లక్షల విలువైన అభరణాల స్వాధీనం



ప్రజాపక్షం/గణపురం: తాళం వేసిన ఇంట్లోకి చొరబడి బంగారు అభరణాలు అపహరించిన ఇద్దరిని గణపురం పోలీసులు శనివారం అరెస్టు చేశారు. మరో నిందితుడి కోసం గాలిస్తున్నట్లు సిఐ కరుణాకర్‌రావు తెలిపారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. వెంకటేశ్వర్లపల్లికి చెందిన ఆకుదారి లక్ష్మి ఆగష్టు 11న భూపాలపల్లిలోని కుమారుడి ఇంటికి వెళ్ళారు. మరుసటి రోజు తిరిగి వచ్చే సరికి ఇంటి తాళాలతో పాటు గదిలోని ఆల్మారా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. పరిశీలించగా సుమారు రూ.1.06లక్షల విలువైన బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీనితో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు క్లూస్ టీమ్ సాయంతో వేలిముద్రలు సేకరించి, సిసి కెమెరాల దృశ్యాలను పరిశీలించారు. ఈ క్రమంలో శనివారం ఉదయం ఓసి 3, పరశురాంపల్లి ప్రాంతంలో ములుగు వైపు వెళ్తున్న రత్నం ప్రవీణ్, టెడ్డెల రాజేష్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుండి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు బెడ్డల శ్రీనివాస్ పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. ముగ్గురు వెంకటేశ్వరపల్లికి చెందిన వారేనన్నారు. అరెస్టయిన ఇద్దరిని కోర్టులో హాజరుపరచగా 14 రోజుల జ్యూడీషియల్ రిమాండ్ విధించినట్లు వెల్లడించారు. కేసును ఛేదించిన కానిస్టేబుళ్లు శ్రీనివాస్, రమేష్‌లను అభినందించి రివార్డులు అందజేశారు.

భూపాలపల్లి – టేకుమట్లకు బస్సు సౌకర్యం కల్పించాలి

సిపిఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేష్ డిమాండ్



ప్రజాపక్షం/టేకుమట్ల: భూపాలపల్లి జిల్లా కేంద్రం నుండి టేకుమట్ల మండల కేంద్రానికి నిత్యం బస్సు సౌకర్యం కల్పించాలని సిపిఐ ఎంఎల్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూపాలపల్లి జిల్లా కేంద్రం నుండి టేకుమట్ల మండలానికి వెళ్లే ప్రజలు సరైన రవాణా సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, కూలీలు, మహిళలు వివిధ పనుల నిమిత్తం జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు ప్రయివేట్ వాహనాలపై ఆధారపడాల్సి వస్తోందని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, ఇతర అవసరాల కోసం జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రజలకు బస్సు సౌకర్యం లేకపోవడం వలన సమయం, డబ్బు వృథా అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఆర్‌టిసి అధికారులో తక్షణమే స్పందించి భూపాలపల్లి నుండి ఠండి మండల కేంద్రానికి ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజా అవసరాలను గుర్తించి అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకొని మండల ప్రజలకు నిత్యం బస్సు సౌకర్యం అందుబాటులోకి తీసుకురావాలని మారపల్లి మల్లేష్ డిమాండ్ చేశారు.

మానవత్వం పరిమళించిన వేళ..!

జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్



ప్రజాపక్షం/భూపాలపల్లి: ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన పోలీసు సేవకు నిదర్శనమని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు. అత్యవసర సమయంలో మానవత్వంతో స్పందించి అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తికి సకాలంలో ప్రథమ చికిత్స అందించిన గణపురం బ్లూకోట్ పోలీసు సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. వారి సేవలను గుర్తిస్తూ నగదు ప్రోత్సాహకాన్ని ప్రకటించి ప్రశంసించారు. గణపురం మండలం నగరంపల్లి గ్రామానికి చెందిన గుట్టం శ్రీను మూర్ఛ కారణంగా అపస్మారక స్థితిలోకి వెళ్లినట్లు డయల్ 112కు అత్యవసర సమాచారం అందింది. దీంతో ఏమాత్రం ఆలస్యం చేయకుండా బ్లూకోట్ కానిస్టేబుల్ పి.సి. మోహన్, హెచ్.జి.రాకేష్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుడికి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించి బాధ్యతాయుతంగా వ్యవహరించారు. ఈ ఘటనపై స్పందించిన జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ, ప్రజలకు ఆపద వచ్చినప్పుడు పోలీసులు ముందుగా గుర్తుకు రావాలి. . ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకోవడం కూడా. విధి నిర్వహణలో అంకిత భావం, సేవా దృక్పథం ప్రదర్శించే పోలీసు సిబ్బందిని ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తాం అని పేర్కొన్నారు.

రెండు నెలలకే దెబ్బతిన్న సిసి రోడ్డు

నాణ్యతా లోపాలపై క్యూసీ అధికారులకు బిఆర్ఎస్ నేతల ఫిర్యాదు



ప్రజాపక్షం/దేగొండ: పెద్దపల్లి గ్రామంలో నిర్మించిన సిసి రోడ్డు రెండు నెలలకే కుంగిపోవడం, పగుళ్లు ఏర్పడడంపై బిఆర్ఎస్ నాయకులు క్వాలిటీ కాంట్రోల్(క్యూసీ) అధికారులకు ఫిర్యాదు చేశారు. రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.20లక్షలు మంజూరు చేయగా, కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని ఆరోపించారు. శనివారం బిఆర్ఎస్ నాయకుడు పసుల రత్నాకర్ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. నిర్మాణంలో నిబంధనల ప్రకారం ఇసుక, కంకర, సిమెంట్ వినియోగించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో రోడ్డు నాణ్యతను పరిశీలించి బాధ్యులైన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని, బిల్లులు నిలిపివేయాలని కోరారు. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సకినాల రవీందర్, వార్డు సభ్యుడు అంబటి కార్తీక్, నాయకులు బోధసు రాజు, గుర్రం రమేష్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్



ప్రజాపక్షం/భూపాలపల్లి: జిల్లా ప్రజలందరికీ జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి, చీకటిపై వెలుగు సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. దీపావళి పర్వదినం జిల్లా ప్రజలందరి ఇళ్లలో సిరిసంపదలు, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు వెల్లివిరియాలని, ప్రతి కుటుంబం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

మహిళా సంక్షేమానికి సర్పంచ్ భూదానం

ప్రజాపక్షం/రేగొండ: గ్రామస్థాయిలో మహిళల సంక్షేమం, సాధికారతకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తిరుమలగిరి సర్పంచ్ చల్లగురుకుల సుదర్శన్ అన్నారు. గ్రామంలో మహిళా భవన నిర్మాణం కోసం తన స్వర్గీయ తల్లిదండ్రులు చల్లగురుగుల శాంతమ్మ, వెంకటనర్సు జ్ఞాపకార్థ మూడు గుంటల భూమిని విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలన్న సిఎం రేవంత్‌రెడ్డి సంకల్పాన్ని గ్రామస్థాయిలో అమలు చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఎంఎల్‌పి గండ్ర సత్యనారాయణరావు సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. మహిళా సమాఖ్య భవనానికి స్థలం విరాళంగా అందించిన సర్పంచ్ సుదర్శన్‌ను మహిళా సమాఖ్య సభ్యులు శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆకుతోట తిరుపతి, బుగులోని జాతయ మాజీ చైర్మన్ రొంటాల వెంకటస్వామి, గ్రామ కమిటీ అధ్యక్షుడు నిమ్మల విజేందర్, దేశిని సాంబయ్య, సిసి విజయలక్ష్మి, సిఏ సురేష్, లక్ష్మి, అనిత, పాలడుగుల రజిత, తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి యువత కృషి చేయాలి



ప్రజాపక్షం/చిట్యాల: మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని చిట్యాల సిఐ వై సతీష్ సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించి విద్యార్థులు, అధ్యాపకులతో మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణంతో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ హెచ్ కర్ణాజీ అధ్యక్షత వహించగా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ముక్కా యుగంధర్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మై భారత్ జిల్లా ఇన్‌చార్జి సురేష్, ప్రతినిధి వేల్పుల రాజ్‌కుమార్, వాలంటీర్ మణికుమార్, కళాశాల అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

కాళేశ్వరం ఆలయంలో చల్లా దంపతుల ప్రత్యేక పూజలు.

ప్రజాపక్షం/కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రసిద్ధి గాంచిన కాళేశ్వరం బాలాలయంలో శనివారం రాష్ట్ర బిజెపి నాయకులు చల్లా నారాయణ రెడ్డి,సుజాత దంపతులు కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకుని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయ అర్చకులు చల్లా దంపతులకు స్వామి వారి శేష వస్త్రాలు అందించి సన్మానించారు.అంతకు ముందు వారు సరస్వతి పుష్కర ఘాట్ వద్ద త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించి నదీమాతల్లికి మొక్కులు చెల్లించుకున్నారు.

అంగన్వాడీలో సామూహిక వేడుకలు



ప్రజాపక్షం/తరిగొప్పుల: మండలంలోని కొత్త తండా గ్రామంలోని అంగన్వాడి సెంటర్లో సామూహిక వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 6 నెలలు నిండిన చిన్నారులకు అన్నప్రాసన వేడుకలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ భూక్య ధనుష్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ రంగమ్మ, అంగన్వాడి టీచర్ వాణి, గర్భిణి తల్లులు, గ్రామస్థులు హాజరయ్యారు. చిన్నారులకు అన్నప్రాసన చేసి, తల్లులకు పౌష్టికాహారం, పిల్లల ఆరోగ్యంపై అవగాహన కల్పించారు.

దివ్యాంగులకు రాష్ట్ర స్థాయి పురస్కారాలు

ప్రజాపక్షం/ములుగుః అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా దివ్యాంగుల సంక్షేమం, సాధికారతకు విశేష సేవలందించిన వ్యక్తులు, సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం పురస్కారాలు అందించనుంది. ఈ మేరకు అర్హుల నుడి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగుల హక్కుల పరిరక్షణ, పునరావాసం, విద్య, ఉపాధి, క్రీడలు, సాంస్కృతిక, సామాజిక సేవా రంగాల్లో ప్రతిభ కనబరిచిన దివ్యాంగులు, వారి అభ్యున్నతికి కృషి చేస్తున్న స్వచ్ఛంద, సేవా సంస్థలు ఈ పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తు నమూనా, అర్హతలు, నిబంధనలు శాఖ అధికారిక వెబ్సైట్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను సంబంధిత ధృవపత్రాలతో జతచేసి ఈ నెల 18వ తేదీలోగా ములుగు జిల్లా సంక్షేమాధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా కలిసిన మండల ఎస్పి సెల్ అధ్యక్షుడు

ప్రజాపక్షం/వెంకటాపురం (నూగురు): కాంగ్రెస్ పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు చిట్యాల సాగర్ శనివారం రోజున భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావును మర్యాద పూర్వకంగా కలశారు. ఈ సందర్భంగా మండలంలోని ఎస్సీ కాలని రోడ్లు, ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు, రాబోయే విడత ఇందిరమ్మ ఇళ్లలో ఎస్సీ సెల్ ఇళ్ల కేటాయింపు వంటి పలు సమస్యలను ఎమ్మెల్యేకి వివరించి సమస్యల పరిష్కారానికి కృషి చేయలసిందిగా కోరారు.

ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి

ప్రజాపక్షం/తాడ్వాయి: ఎహాచ్ఎస్ తాడ్వాయి పాఠశాలలో ప్రధానోపాధ్యాయారులు రేవతి ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ అధికారి గడ్డి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పదో తరగతి ఫలితాలలో 100% సాధించడానికి ఉపాధ్యాయుల సమావేశానికి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం పదో తరగతి ఫలితాలలో 100% సాధించడానికి అమదరూ కృషి చేయాలని కోరారు. అలాగే విద్యార్థులంతా ఎక్కవ సమయం పాఠశాలలోనే గడుపుతారు గనుక వారికి వివిధ ఆంశాలలో గల సందేహాలను నివృత్తి చేసి 100% ఫలితాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలోఉపాధ్యాయులు సుహాసిన, సరోజిని, ఉషారాణి తదితరులు పాల్గోన్నారు.

వేసవి విద్యుత్ డిమాండ్‌ను సమర్థవంతంగా ఎదుర్కోవాలి



ప్రజాపక్షం/హనుమకొండ: రానున్న వేసవిలో విద్యుత్ డిమాండ్ పెరిగే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని ముందస్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, అందుకు అనుగుణంగా అవసరమైన పనులను సకాలంలో పూర్తి చేయాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అధికారులను ఆదేశించారు.హనుమకొండ నక్కలగుట్టలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఆపరేషన్స్, ప్రాజెక్ట్స్, పిఅండ్ ఎంఎం విభాగాల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో సీఎండీ మాట్లాడుతూ సంస్థ పరిధిలోని 18 సర్కిళ్లలో విద్యుత్ అవసరాలను సమగ్రంగా అంచనా వేసి, కొత్త సబ్‌స్టేషన్లు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల అవసరాన్ని గుర్తించి తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రస్తుతం పురోగతిలో ఉన్న కొత్త సబ్‌స్టేషన్ల పనులను డిసెంబర్ నెలాఖరులోగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు.33 కేవీ, 11 కేవీ ఓవర్‌లోడ్ ఫీడర్లను గుర్తించి, అవసరమైన ప్రాంతాల్లో అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.విద్యుత్ లోడ్ అధికంగా ఉండే పట్టణాలు, మున్సిపల్ కార్పొరేషన్ ప్రాంతాలతో పాటు కొత్తగా నిర్మిస్తున్న సబ్‌స్టేషన్లలో 8 ఎంవీఏ సామర్థ్యం కలిగిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని తెలిపారు.గోదావరి పుష్కరాలకు అన్ని ఏర్పాట్లు చేయాలని, విద్యుత్ శాఖ పనులన్నీ గడువు లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు వి. మోహన్ రావు, టి. మధుసూదన్, చీఫ్ ఇంజినీర్లు కె. తిరుమల్ రావు, అశోక్, సురేందర్, జనరల్ మేనేజర్లు విజేందర్ రెడ్డి, అమర్‌నాథ్, ప్రభావతి, బాబు రావు, ఎస్ఈ (సివిల్) వెంకటేశ్వర్లు, డీఈలు నాగరాజు, అనిల్ కుమార్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

భూ సేకరణ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు



ప్రజాపక్షం/జనగామ: భూ సేకరణ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న భూ సేకరణ ప్రక్రియపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ భూ సేకరణ ప్రక్రియలో భాగంగా అసైన్డ్ భూములకు సంబంధించిన వివరాలను క్షేత్ర స్థాయిలో క్షుణంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఒక భూమి అసైన్డ్ భూమిగా పరిగణించేందుకు సంబంధిత అసైన్మెంట్ సర్టిఫికెట్, అసైన్మెంట్ ఫైల్, భూమి కేటాయింపు సమయంలో చేసిన నామోదు వంటి మూడు కీలక అధారాలు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న రికార్డులన్నింటిని సమగ్రంగా పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలని సూచించారు. రైల్వే శాఖకు సంబంధించిన భూ సేకరణ అంశాలపై సమీక్షిస్తూ గుర్తించిన భూములకు సంబంధించి నోటిఫికేషన్ ప్రక్రియను నిబందనల ప్రకారం చేపట్టాలని సూచించారు. సుమారు ఆరు ఎకరాలకు సంబంధించిన భూ సేకరణ ప్రతిపాదనలపై అవసరమైన ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో నీటి పారుదల శాఖ ఎస్ఇ సీతారాం, ఎన్డిసి పులిరాజు, ఎడ్రాజ్వరపు జనగామ, స్టేషన్‌ఘనపూర్ ఆర్డిఓలు గోపిరాం, కిణన్‌ప్రకాష్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి



ప్రజాపక్షం/హసన్‌పర్తి:బాల్యవివాహాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలంగాణ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నాగ తులసి పిలుపునిచ్చారు. హనుమ కొండ జిల్లా హసన్ పర్తి మండల పరిధిలోని తెలంగాణ గురుకుల బాలికల పాఠశాలలో శనివారం హసన్ పర్తి మండల 100 రోజుల బాల్య వివాహాల నిర్మూలన ప్రచార కార్యక్రమాన్ని జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ షేర్ ఎన్జీవోస్ హనుమ కొండ షేర్ ఎన్జీవో కోఆర్డినేటర్ శిరీష ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నాగ తులసి ముఖ్య అతిథిగా హాజరైనారు. బాల్య వివాహాలు ఎక్కడైనా జరుగుతున్నట్లు గుర్తించినప్పుడు వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని, బాలల రక్షణ కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.బాల్య వివాహాల రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సుమారు 600 మంది విద్యార్థులు మహిళా సాధికారికత కళ్యాణి, స్వర్ణలత, చామంతి పాల్గొన్నారు.

కొత్తవాడ ఎంజిరోడ్ పోస్ట్‌ఫీస్‌ను తరలించవద్దు

సిపిఐ రాష్ట్ర నాయకులు వెంకట్రాములు



ప్రజాపక్షం/వరంగల్ : వరంగల్ కొత్తవాడ ఎంజి రోడ్డులోని సబ్ పోస్టాఫీస్‌ను తరలించవద్దని సిపిఐ రాష్ట్ర నాయకులు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తవాడ తుమ్మలకుంట ఆటోనగర్ ప్రాంతాలలోని వేలాది మంది ప్రజలకు సేవలను అందిస్తున్న సబ్‌పోస్టాఫీస్‌ను ఇతర ప్రాంతాలకు తరలించాలని చూడడం ఈప్రాంత ప్రజలకు తీరని అన్యాయం చేయడమే అవుతుందన్నారు. కొత్తవాడలోని ఈ పోస్టాఫీస్ వలన బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బడుగు బలహీన వర్గాల ప్రజలకు చేనేత కార్మికులకు విద్యార్థులకు రిటైర్డ్ ఉద్యోగులకు ఎంతగానో ఉపయోగపడుతూ విశేషంగా సేవలను అందిస్తున్నదన్నారు. అలాంటి సబ్‌పోస్టాఫీస్‌ను కొత్తవాడ నుండి వేరే ప్రాంతానికి తరలించాలనే ఆలోచనను విరమించుకోవాలన్నారు.

ప్రతి గ్రామానికి తాగునీరు... రూ.18 కోట్లతో పనులు



ప్రజాపక్షం/ములుగుః జిల్లాలోని ప్రతి గ్రామానికి తాగునీరు అందించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ హేమంత్ బోర్కడే తెలిపారు. రామప్ప జలాశయంలో ఏడాదికి సరిపడా నీటి నిల్వలు ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లాలో 97 గ్రామాల్లో తాగునీటి సరఫరా బలోపేతానికి రూ.18కోట్లతో ప్రతిపాదనలు రూపొందించినట్లు వెల్లడించారు. జిల్లాలోని 152 గ్రామాలకు రామప్ప జలాశయం ద్వారా, మరో ఆరు మండలాలకు గోదావరి జలాల ద్వారా మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. నీటి కొరత తలెత్తకుండా జిల్లా స్థాయి కమిటీ నిరంతరం పర్యవేక్షిస్తుందన్నారు. అవసరమైన చోట బోర్లు, చేతి పంపులు, ట్యాంకర్ల ద్వారా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు. నవంబర్ 15 నుండి డిసెంబర్ 30 వరకు తాగునీటి సరఫరాపై ప్రత్యేక కార్యక్రమం చేపట్టనున్నటుల తెలిపారు. గ్రామాల్లో నీటి సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. తాగునీటిని పొదుపుగా వినియోగించి, వృథాను అరికట్టాలని ప్రజలకు సూచించారు. సమస్యలు ఉంటే సంబంధిత పంచాయతీ కార్యదర్శి లేదా మిషన్ భగీరథ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

దొంగతనాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

ప్రజాపక్షం/కమలాపూర్ఃకష్టపడి పని చేసుకోకుండా సులభంగా డబ్బు సంపాదించుకోవాలనే దురుద్దేశంతో దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తులు స్మార్ట్ టెక్నాలజీతో ఎంతటి వారినైనా అదుపులోకి తీసుకోని చట్టపరమైన చర్యలు తీసుకోవడం తప్పదని కమలాపూర్ సిఐ పి. నవీన్ అన్నారు. కమలాపూర్ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ దగ్గర పార్క్ చేసిన బైక్ ను దొంగలించిన మంచిర్యాల జిల్లా రామగుండం మండలం 8 ఇంక్లైన్ కాలనీకి చెందిన విన్సెంట్ కెవిన్ ను పట్టుకుని రిమాండ్ కు తరలించినట్లు సిఐ తెలిపారు. ఇట్టి దొంగను పట్టుకోవడంలో ఎస్ఐ అనంతగిరి మధు, కానిస్టేబుళ్ళు లావుడియా మోహన్, మాలోతు ఉదయ్, గుగులోతు కృష్ణమోహన్, గుడెల్లి భాస్కర్ లను కమలాపూర్ ఇన్స్పెక్టర్ పులిగిల్ల నవీన్ అభించించారు.

గంగపుత్ర ఆత్మగౌరవ భవనానికి రూ.5 కోట్ల నిధుల మంజూరుపై హర్షం

ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : గంగపుత్రుల చిరకాల స్వప్నమైన ఆత్మగౌరవ భవన నిర్మాణానికి రూ.5 కోట్ల నిధులు మంజూరు చేయడం పట్ల తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యవర్గం హర్షం వ్యక్తం చేసింది.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యవర్గం తరపున ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని సంఘం రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర ఒక ప్రకటనలో పేర్కొన్నారు.గంగపుత్రుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలవనున్న ఈ భవనం సామాజిక ఐక్యతకు సంఘటిత శక్తికి, భావితరాల అభ్యున్నతికి కేంద్రంగా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.గంగపుత్రుల సంక్షేమం అభివృద్ధి ఆత్మగౌరవానికి ప్రాధాన్యతనిస్తూ నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి యావత్ గంగపుత్ర సమాజం తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని తెలిపారు.

కోడి పందాల స్థావరంపై పోలీసుల దాడి

ప్రజాపక్షం/కన్నాయిగూడెం: మండలంలోని తుపాకులగూడెం సమీప అటవీ ప్రాంతంలో శుక్రవారం కోడి పందేలు ఆడుతున్నారన్న పక్కా సమాచారంతో స్థానిక ఎస్సై పుట్ట సతీష్ పోలీస్ సిబ్బందితో కలిసి కోడి పందాలు ఆడుతున్న పదకొండు మందిని 4 కోళ్ళని నగదు రూ.9400/ స్వాధినం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ఎవ్వరైన పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సతీష్ హెచ్చరించారు.

ఔట్ సోర్సింగ్ పోస్టులకు ప్రశాంతంగా రాత పరీక్ష

ప్రజాపక్షం/జనగామ టౌన్: జిల్లాలోని 8 తెలంగాణ మోడల్ పాఠశాలలు, ప్రభుత్వ వైద్య కళాశాలలో ఖాళీగా ఉన్న 43 ఔట్ సోర్సింగ్ పోస్టుల భర్తీకి శనివారం రాత పరీక్ష ప్రశాంతంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పర్యవేక్షణలో పరీక్ష పారదర్శకంగా జరిగింది. మొత్తం 1533 మంది దరఖాస్తు చేసుకోగా 1298 మంది హాజరయ్యారు. 235 మంది గైర్హాజరయ్యారు. కంప్యూటర్ టీచర్ పోస్టులకు 389 మంది దరఖాస్తు చేసుకోగా 322 మంది పరీక్ష రాశారు. యోగా టీచర్ పోస్టులకు 38మంది, ఆర్ట్ టీచర్ పోస్టులకు 50 మంది, లైబ్రేరియన్ పోస్టులకు 164 మంది పరీక్ష రాయడం జరిగింది. అదే విధంగా ప్రభుత్వ వైద్య కళాశాలలో మొత్తం 11 పోస్టులకు సంబంధించి డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు 274మంది, క్లర్క్‌కు 32 మంది, రికార్డ్ అసిస్టెంట్‌కు 10 మంది, అటెండెంట్‌కు 04 మంది, ల్యాబ్ అటెండెంట్‌కు 31 మంది, ఆఫీస్ సబార్డినేట్‌కు 372 మంది అభ్యర్థులు హాజరై పరీక్ష రాయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్, జిల్లా ఉపాధి అధికారి కుమార స్వామి, అధికారులు, పాల్గొన్నారు.

ఝాన్సీరెడ్డిపై నిరాధార ప్రచారాలను తీవ్రంగా ఖండిస్తున్నాం

ప్రజాపక్షం/కొడకండ్ల: టిపిసిసి ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డిపై నిరాధార ప్రచారాలను తీవ్రంగా ఖండిస్తున్నామని కొడకండ్ల మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు సోమారపు శ్రీకాంత్ అన్నారు. శనివారం వారు పత్రిక ప్రకటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ టిపిసిసి ఉపాధ్యక్షురాలు ఝాన్సిరెడ్డిపై ఇటీవల ఆంధ్రజ్యోతి పత్రికలో ప్రచురితమైన కథనం, ఇతర మాధ్యమాలలో జరుగుతున్న అసత్య ప్రచారాలను తీవ్రంగా ఖండించారు. ఝాన్సిరెడ్డి ఈ ప్రాంతానికి చెందినవారేనని, వారి స్థానికతను ప్రశ్నిస్తూ ఎన్నారై అనే అంశాన్ని తెర పైకి తీసుకొచ్చి, టిపిసిసి ఉపాధ్యక్ష పదవిపై అనవసరమైన అపోహలు సృష్టించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్, జిల్లా కార్యదర్శి ధర్మారపు భిక్షపతి, ఎస్టీసెల్ నాయకులు శ్రీను నాయక్, సీనియర్ నాయకులు మార్గం రవీందర్, కుమార స్వామి, కనకయ్య, నాగరాజు, మల్లేష్, సర్పంచ్లు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సమీక్ష

ప్రజాపక్షం/జనగామ టౌన్: జిల్లాలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా వైద్యాధికారి డా. వాణిశ్రీ సూచించారు.శనివారం ఐడీఓసీలో వైద్యాధికారులు, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, సూపర్‌వైజర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. గర్భిణుల నమోదు, వైద్య పరీక్షలు, ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించడం, చిన్నారులకు సకాలంలో టీకాలు వేయించాలని సూచించారు. టీబీ, ఎన్సీడీ వ్యాధుల గుర్తింపు, చికిత్సను వేగవంతంచేయాలని, పొగాకు రహిత యువత ప్రచారంలో భాగంగా విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. కుష్ఠు వ్యాధి అనుమానితులకు పరీక్షలు నిర్వహించి చికిత్స అందించాలని, వర్షాల నేపథ్యంలో దోమల నివారణకు ప్రజలు జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు, మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక విద్యార్థుల ప్రతిభకు సిపి ప్రోత్సాహం



ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ : బాలసముద్రం లోని మల్లికాంబ మనోవికాస కేంద్రానికి చెందిన ప్రత్యేక విద్యార్థులు, కేంద్రం వ్యవస్థాపకురాలు రామలీల, ఈసీ సభ్యుడు కల్యాణ్‌తో కలిసి హనుమకొండ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్ స్టాల్‌ను సందర్శించి, ప్రత్యేక విద్యార్థులు స్వయంగా తయారుచేసిన హ్యాండ్‌మేడ్ వస్తువులను కొనుగోలు చేశారు. విద్యార్థుల సృజనాత్మకత, నైపుణ్యాలను అభినందిస్తూ వారిని ప్రోత్సహించారు. ప్రత్యేక విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని పేర్కొన్నారు. నంతరం ప్రత్యేక విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేసి, దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటిస్తూ, వారి ప్రతిభను ప్రోత్సహించడం ఆనందంగా ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (పరిపాలన) రాయల ప్రభాకర్ రావు, ఎఆర్ అడిషనల్ డీసీపీ సురేష్, ఆర్ఐ (అడ్మిన్) సర్జన్ రాజ్, వెల్ఫేర్ ఆర్ఐ సతీష్, ఆర్ఐ శ్రీధర్ , మల్లికాంబ మనోవికాస కేంద్రం సిబ్బంది, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పలు డివిజన్లలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



ప్రజాపక్షం/వరంగల్ టౌన్ : వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని గ్రేటర్ వరంగల్ నగరంలోని వివిధ డివిజన్లలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఈరోజు గ్రేటర్ వరంగల్ నగరంలోని 44,45,64వ డివిజన్లలో రహదారులు, డ్రైనేజీ నిర్మాణ పనులకు వరంగల్ మున్సిపల్ కమిషనర్ వెంకన్నతో కలిసి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు శంకుస్థాపనలు నిర్వహించారు.కడిపికొండలోని 44, 45వ డివిజన్ల పరిధిలో రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులతో పాటు, 44వ డివిజన్ పరిధిలోని సింగారం, కొత్తపల్లి గ్రామాల్లో, 64వ డివిజన్‌లోని ఇంటీరియల్ కాలనీలో రహదారులు, డ్రైనేజీ నిర్మాణాలకు సుమారు 3కోట్లకు పైగా పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు నిత్యం అవసరమైన మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా రహదారుల అభివృద్ధి ద్వారా మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు, డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించి వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపించడమే లక్ష్యమని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల విషయంలో ఎక్కడా నాణ్యతా ప్రమాణాల్లో రాజీ పడకుండా, నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం పనులు చేపట్టాలని, నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పట్టణాలు, గ్రామాల సమగ్ర అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోందని అన్నారు. ప్రజల అవసరాలను గుర్తిస్తూ, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగుతూ ప్రతి డివిజన్‌కు అభివృద్ధి ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 44వ డివిజన్ అధ్యక్షులు జక్కుల సదానందం, 45 వ డివిజన్ అధ్యక్షులు కర హరీష్ రెడ్డి, 46 డివిజన్ అధ్యక్షులు వస్కుల శ్రీను, 64వ డివిజన్ అధ్యక్షులు దువ్వ శ్రీకాంత్,పాక్స్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, కార్యకర్తలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే ధ్యేయం



ప్రజాపక్షం/జఫర్‌గఢ్: గ్రామ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పంచాయతీ పాలకవర్గం అంకితభావంతో పనిచేస్తోందని స్థానిక సర్పంచ్ కుల్ల మోహన్ రావు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రం లోని 8వ వార్డులో గ్రామపంచాయతీ నిధుల ద్వారా మంజూరైన మురుగు కాలువ (మోరి)పై స్లాబ్ నిర్మాణ పనులను సర్పంచ్ కుల్ల మోహన్ రావు, ఉప సర్పంచ్ కోత్వాల కుమార్, 8వ వార్డు సభ్యురాలు రోడ్డ మమతా రాజులతో కలిసి పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించడంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. చాలా కాలంగా డ్రైనేజీపై స్లాబ్ లేకపోవడంతో వార్డు ప్రజలు, పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దోమల బెడద, దుర్వాసన సమస్యలను దృష్టిలో ఉంచుకొని ప్రాధాన్యత క్రమంలో ఈ పనులను చేపట్టినట్లు వివరించారు. గ్రామంలో నెలకొన్న అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు, తాగునీరు వంటి సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని, ప్రతి వార్డును సమానంగా అభివృద్ధి చేసి జఫర్‌గఢ్‌ను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జ్యోతి యాకయ్య, కుక్కల సారంగం, శివరాజు, రాజ్ కుమార్,నేష్, సమ్మయ్య, వార్డు ప్రజలు, గ్రామ ప్రముఖులు, యువకులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మేకల రవి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



ప్రజాపక్షం/వరంగల్ టౌన్ : సిపిఐ నాయకులు మేకల రవి కుటుంబాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలని గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి కోరారు. శనివారం ఆయన మేకల రవి కుటుంబ సభ్యులను శివనగర్ పరామర్శించిన అనంతరం మాట్లాడుతూ విద్యార్థి విభాగం నుండి క్రియాశీల రాజకీయంలోకి వచ్చి సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులుగా ఎన్నో ఆందోళనలు చేశారని, మైక్రో ఫైనాన్స్ దౌర్జన్యాన్ని ఎండగట్టి నిలిపివేసి, తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి అనేక సార్లు జైలుకు వెళ్లిన వ్యక్తి అన్నారు. ఇతని తల్లిదండ్రులు మాజీ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ గా ప్రతిసారి ఎలక్షన్లలో పనిచేశారని, సిపిఐ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ పొత్తులో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే గెలుపు కు కీలక పాత్ర పోషించాడని, ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాడని, ప్రస్తుతం ఆయన కుటుంబ సభ్యులు ఆర్థిక సంక్షోభంలో ఉన్నారని తెలిపారు. ఇతనికి భార్య, ఇద్దరు ఆడపిల్లలున్నారని, వారి కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ ఆదుకోవాలని అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ను, సీఎం రేవంత్ రెడ్డిని రాజనాల శ్రీహరి డిమాండ్ చేశారు.

ఎస్‌జిఎఫ్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో పిఎం శ్రీ గురుకుల విద్యార్థుల ప్రతిభ

ప్రజాపక్షం/వేలేరు : హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీ మైదానంలో నవంబర్ 5,6 తేదీలలో నిర్వహించిన అండర్17 రాష్ట్ర స్థాయి కబడ్డి పోటీల్లో హనుమకొండ జిల్లా జట్టు మూడో స్థానం సాధించింది.రాష్ట్రంలోని 33 జిల్లాల జట్టు పాల్గొన్న ఈపోటీలలో వేలేరు మండలకేంద్రంలోని పిఎం శ్రీ గురుకుల పాఠశాల టిజిఆర్ఎస్ అండ్ జే సీ(బాలురు)విద్యార్థులు తమ క్రీడా ప్రతిభను చాటుకున్నారు.ఈపోటీల్లో వేలేరు గ్రామానికి చెందిన సోంపెల్లి రోహిత్ తేజ్ హనుమకొండ జిల్లా జట్టుకు కెప్టెన్ గా వ్యవహరించడం విశేషం.ఇంటర్ మీడియెట్ ఎంపిసి ద్వితీయ సంవత్సరం చదువుతున్న రోహిత్ తేజ్ తో పాటు చందు,విజయ్,రిత్విక్ తదితర విద్యార్థులు అద్భుతమైన ఆటతీరుతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు.విద్యార్థులు సాధించిన విజయంపై శనివారం కళశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ రౌతు అజయ్‌కుమార్ హర్షం వ్యక్తం చేస్తూ వారిని అభినందించారు. విద్యార్థుల క్రీడా ప్రతిభను ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లి దండ్రులు ప్రత్యేకంగా అభినందించారు.

లక్ష్మణ్‌గౌడ్ కుటుంబానికి అండగా ఉంటాం

ప్రజాపక్షం/బచ్చన్నపేట: మండలంలోని కొన్నె గ్రామానికి చెందిన ఉద్యమకారుడు వేముల లక్ష్మణ్‌గౌడ్ ఇటీవల ఆత్మహత్య చేసుకుని మృతిచెందడం పట్ల ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. శనివారం ఆయన కొన్నె గ్రామానికి వెళ్లి లక్ష్మణ్‌గౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముందుగా లక్ష్మణ్‌గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన ఎర్రోళ్ల శ్రీనివాస్ అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్టకాలంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలన్నారు. లక్ష్మణ్‌గౌడ్ కుటుంబం ఒంటరిది కాదని, పార్టీ నాయకత్వం, స్థాక శాసనసభ్యుల తరపున అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ పరామర్శలో గంగం సతీష్ రెడ్డి, ఇర్రి రమణారెడ్డి, చల్ల శ్రీనివాస్ రెడ్డి, కోడూరు శివకుమార్ గౌడ్, వెంకట్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి

ప్రజాపక్షం/దేవరుప్పుల: ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటి వినియోగం ఎక్కువగా ఉండే మొక్కజొన్నకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి అంబికాసోని సూచించారు. శనివారం మండలంలో యూరియా, డీఏపీ ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలని విత్తన డీలర్లకు సూచించారు. ప్రత్యామ్నాయ పంటల సాగులో డీలర్లు కీలక పాత్ర పోషించాలన్నారు.

బిఆర్ఎస్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి

ప్రజాపక్షం/వెంకటాపూర్ : వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంతో పాటు పలు పంచాయతీల్లో శుక్రవారం పర్యటించిన మంత్రి సీతక్క గ్రామాల అభివృద్ధి, రామప్ప రిజర్వాయర్‌కు నీటి సరఫరా, కాళేశ్వరం ప్రాజెక్టుపై చేసిన వ్యాఖ్యలు వాస్తవాలకు దూరంగా ఉండటం తోపాటు ఈ ప్రాంత ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మల్క రమేష్ తీవ్ర స్థాయిలో విమర్శించారు.ఈ మేరకు ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు.పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో గ్రామ స్వరాజ్యానికి పెద్దపీట వేసి, పల్లెల రూపురేఖలనే మార్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దేనని ఆయన పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, గ్రామపంచాయతీ భవనాలు, పల్లె ప్రకృతి వనాలు, వీధి దీపాలు, డంపింగ్ యార్డులు, వైకుంఠధామాలు వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని గుర్తు చేశారు. గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఆశా వర్కర్ల వ్యవస్థను బలోపేతం చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు గత ప్రభుత్వం కృషి చేసిందన్నారు.మూడేళ్లుగా అధికారంలో ఉండి ములుగు జిల్లాకు మీరు కొత్తగా సాధించిన అభివృద్ధి ఏమిటని మంత్రి సీతక్కను ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన పనులకు, నిర్మించిన భవనాలకు రిబ్బన్లు కట్ చేస్తూ వాటిని మీ ప్రభుత్వ ఘనతగా ప్రచారం చేసుకోవడం తప్ప కొత్తగా సాధించిందేమిటని నిలదీశారు.గత ప్రభుత్వం నిర్మించిన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేస్తూ వాటిని తమ విజయాలుగా చెప్పుకోవడం మానుకోవాలని హితవు పలికారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి



ప్రజాపక్షం/నర్సంపేట : మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని నర్సంపేట సిఐ శ్రీనివాస్ అన్నారు. భారత ప్రభుత్వయువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మేరా యువభారత్ ద్వారా నర్సంపేటలోని బాలాజీ మహిళా డిగ్రీ కళాశాలలో నషా ముక్తి యువ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్‌రాజ్ అధ్యక్షతన శనివారం నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నర్సంపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం యువత శారీరక మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల అలవాటు వ్యక్తి గత జీవితాన్నే కాకుండా కుటుంబ వ్యవస్థను, సామాజిక వాతావరణాన్ని కూడా దెబ్బతీస్తుందని వివరించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. జిల్లా బాల సంక్షేమ సమితి చైర్ పర్సన్ వసుధ మాట్లాడుతూ కౌమార దశ అనేది ప్రతి ఒక్కరి జీవితంలో అత్యంత కీలకమైన దశ అని, యువత చెడు స్నేహాలకు, వ్యసనాలకు లోనుకాకుండా, క్షణికమైన ఆనందం కోసం మత్తు పదార్థాలకు బానిసలై ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. డాన్ బాస్కో నవజీవన్ ఎన్జీవో ప్రాజెక్టు మేనేజర్ కరుణాకర్ మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ యుగంలో సోషల్ మీడియాను విద్యార్థినులు సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, వ్యక్తిగత సమాచార దుర్వినియోగం వంటి ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వివరించారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాస్,హెల్పింగ్ హాండ్స్ డీఅడిక్షన్ సెంటర్ సైకాలజిస్ట్ డాక్టర్ మనోజ్ కుమార్, జాతీయ యువ జన అవార్డు గ్రహీత డాక్టర్ ఆకులపల్లి మధు, వివిధ రంగాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. సుమారు 350 మంది విద్యార్థినులు పాల్గొని మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి తమ వంతు బాధ్యతను గుర్తిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

రవి కుటుంబాన్ని పరామర్శించిన కొండా సురేఖ



ప్రజాపక్షం/ఖిలా వరంగల్ : నగరంలోని శివనగర్‌కు చెందిన సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు మేకల రవి అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని మాజీ మంత్రి కొండా సురేఖ మురళీధర్ శనివారం పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ఆర్థికసాయం అందించడంతో పాటు మనోధైర్యం కల్పించారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు గోపాల నవీన్‌రాజ్, వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్, మాజీ కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్, కాంగ్రెస్ నాయకులు శ్రీరామ్ రాజేష్, పగడాల సతీష్, పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం



ప్రజాపక్షం/ఖానాపురం : మండలంలోని పెద్దమ్మగడ్డ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. ఎంఎల్‌పి దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు ఏఎంసి వైస్ చైర్మన్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి లబ్ధిదారుల ఇళ్లకు శంకుస్థాపన చేసి ముగ్గుపోశారు. ఈ సందర్భంగా కొత్తూరు రవి కవిత, గణిపాకం మల్లయ్య రాధలకు ప్రోసీడింగ్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేదల సొంతింటి కలను నెరవేర్చడమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణంలో సహకరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఆత్మ అధ్యక్షుడు బిక్షంరెడ్డి, వార్డు సభ్యులు మల్లికార్జున్, కందుల సాంబయ్య, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ముస్తఫా, పల్నాటి శ్రీను, రాంబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నీరు, విద్యుత్, ఆహార పదార్థాలను పొదుపుగా వాడాలి



ప్రజాపక్షం/నర్సంపేట : ఎల్‌నినో దృష్ట్యా నిత్యావసరాలైన నీరు, విద్యుత్, ఆహార పదార్థాలను పొదుపుగా వాడాలని రిసోర్స్ పర్సన్‌లుగా హాజరైన స్వయంకృషి సంస్థ నిర్వాహకులు బెజ్జంకి ప్రభాకర్, ప్రతిభ సంస్థ ప్రతినిధి బోయిని వెంకటస్వామిలు అన్నారు. నర్సంపేట పట్టణంలోని స్వయంకృషి స్వచ్ఛంధ సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఎల్‌నినో దృష్ట్యా నిత్యావసరాలైన నీరు, విద్యుత్, ఆహార పదార్థాల పొదుపు పైన బాలబాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోడెం కాంతారావు అధ్యక్షతన నిర్వహించగా వారు హాజరై ప్రసంగించారు. ప్రస్తుతం దేశంలో ఉన్న ఎల్‌నినో దృష్ట్యా ప్రజలందరూ నిత్యావసరాలైన నీరు, విద్యుత్, ఆహార పదార్థాలను పొదుపుగా వాడాలన్నారు. ఎల్‌నినో అంటే పసిఫిక్ మహాసముద్ర మధ్య ప్రాంతాలు, తూర్పు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతల్లో వచ్చే మార్పులు, ఉష్ణోగ్రతల పెరుగుదల మూలంగా పవన వ్యవస్థలో మార్పుల మూలంగా భారత్‌లాంటి దేశంలో వర్షాభావ, కరువు పరిస్థితులు నెలకొనే అవకాశం ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో సోషల్ టీచర్ రవి, పిఈటి స్వామి, ఉపాధ్యాయ సిబ్బంది, బాలబాలికలు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



ప్రజాపక్షం/రాయపర్తి : మండలంలోని కేశపురం గ్రామంలో గ్రామ ఉపసర్పంచ్ చెదలు బిక్షపతి తండ్రి చెదలు సోమయ్య, జింకురాం తండా గ్రామ సర్పంచ్ గుగులోత్ సునీత శ్రీను నాయక్ వదిన కవిత, తిర్మలాయపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముద్రబోయిన ముత్తయ్య ఇటీవల అనారోగ్యాలతో మరణించగా మృతుల కుటుంబాలను శనివారం పాలకుర్తి ఎంఎల్‌పి మామిడాల యశస్వినిరెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపి ఆర్థిక సహాయాలు అందజేశారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హమ్యానాయక్, మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి, వర్ధన్నపేట మార్కెట్ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి, మాచర్ల ప్రభాకర్, ముద్రబోయిన వెంకటేశ్వర్లు, భూక్య సమ్మయ్య, ఎండి అఫ్రోజ్, ఉళ్లేంగుల యాదగిరి, చిర్ర మల్లయ్య, ఉళ్లేంగుల నర్సయ్య, పెండ్లి మహేందర్ రడ్డి, కాంచనపల్లి వనజరాణి, గుజే సుధాకర్ రాయిని యాకన్న, లునావత్ కిషన్, భూక్య పరమేష్, బొమ్మేర కళ్యాణ్, పిరని ప్రవీణ్, ఉబ్బని నవీన్, తదితరులు పాల్గొన్నారు.

నేల ఆరోగ్యాన్ని బట్టి పంటలు సాగు చేయాలి

జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయనిర్మల



ప్రజాపక్షం/రాయపర్తి : రైతులు నేల ఆరోగ్యాన్ని బట్టి పంటల సాగు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల అన్నారు. మండలంలోని మొరిపిరాల గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ పెదగోని నాగరాజు అధ్యక్షతన ఖేత్ బచావో అభియాన్‌లో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయనిర్మల పాల్గొని మాట్లాడుతూ రైతులు నేల ఆరోగ్యాన్ని కాపాడుతూ సాగు ఖర్చులు తగ్గించుకోవాలని సూచించారు. నేల పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలని, పంట మార్పిడి, మల్చింగ్, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించాలని, ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. రైతులు యాసంగిలో వరి పంట సాగు చేయొద్దని, వరి పంట కోసం ఎక్కువ నీళ్లు అవసరం కాబట్టి భూగర్భ జలాలు తగ్గి తాగునీరు దొరకని పరిస్థితి వచ్చే అవకాశం ఉందని, కావు, తక్కువ నీళ్లు అవసరం ఉండే పంటలు సాగు చేసుకోవాలని, వరికి బదులుగా పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాలు, కూరగాయల పంట సాగు చేస్తూ అధిక లాభాలు పొందాలని కోరారు. పశువులకు అవసరమైన మేత అందుబాటుపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట డివిజన్ వ్యవసాయ సంచాలకులు నర్సింగ, మండల వ్యవసాయ అధికారి గుమ్మడి వీరభద్రం, వ్యవసాయ విస్తరణ అధికారి క్రాంతి, ఉప సర్పంచ్ మహేంద్ర, రెవెన్యూ జిపిఓ సురేష్, పంచాయతీ కార్యదర్శి సోమరాజు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి వెలుగులు..పేదింట పండగ సంబరాలు!

ప్రజాపక్షం/నెక్కొండ : పేదల సొంతింటి కలను నిజం చేస్తూ ఈ దీపావళికి వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతోంది ఇందిరమ్మ ఇళ్ల పథకం. తెలంగాణ ప్రజాపాలనలో భాగంగా ఎంఎల్‌పి దొంతి మాధవరెడ్డి ప్రత్యేక చొరవతో నెక్కొండ మండలానికి 692 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో ఇప్పటి వరకు 321 ఇళ్ల నిర్మాణాలు పూర్తికాగా, 124 ఇళ్ల పనులు ఇంకా ప్రారంభం కాలేదు. ఈ సందర్భంగా ఆ యా గ్రామాల సర్పంచ్‌లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు లబ్ధిదారులతో కలిసి నూతన గృహాల్లో దీపాలు వెలిగించి పండగ సంబరాలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. పేదల ఇంట సొంతి ంటి దీపం వెలగాలన్న ప్రభుత్వ సంకల్పం సాకారమవుతుండడం తో లబ్ధిదారుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఈ దీపావళి వారికి కేవ లం పండగే కాదు..సొంతింటి కల నెరవేరిన మధుర జ్ఞాపకం! ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత అధికారులతో ఆయా గ్రామాలలో దీ పావళి ఇందిరా గృహాలు నిర్మించిన లబ్ధిదారులతో సంబరాలు ని ర్వహించడం కోసం పోస్టర్లు అతికించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు స మాచారం.

మేటీలకు ప్రత్యేక శిక్షణ.. పనులపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాపక్షం/ఖానాపురం : ఖానాపూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో వివిజీ రామ్‌జి పథకంలో భాగంగా మేటీలకు శిక్షణ, నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపిడిఓ వి అద్వైత హాజరై మేటీలకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ గ్రామాల్లో పనులకు తీసుకురావడంలో మేటీలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. గ్రామ ప్రజలతో సమన్వయం చేసుకుంటూ కూలీలు పనుల్లో చురుకుగా పాల్గొనేలా ప్రోత్సహించాలన్నారు. స్మార్ట్‌ఫోన్ వినియోగంతో పాటు ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా హాజరు నమోదు చేసే విధానంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. పనుల కొలతలు, పని విధానంపై కూలీలకు అవగాహన కల్పిస్తూ నాణ్యమైన పనులు జరిగేలా చూడాలన్నారు. మేటీల సమన్వయం, చొరవతో కూలీల పనితీరును మెరుగుపరిచి రోజువారీ వేతనం గరిష్టంగా రూ.308 పొందేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ సునీత, ఈసీ అరుణ్‌కుమార్, సాంకేతిక నిపుణులు, పాల్గొన్నారు.

అంబేద్కర్, స్వామి వివేకానంద విగ్రహాలను తొలగించవద్దు

ప్రజాపక్షం/ నల్లబెల్లి : బస్టాండ్ ఆవరణ సమీపంలో గతంలో ప్రతిష్ఠించిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, స్వామి వివేకానంద విగ్రహాలను తొలగించాలనే ఆర్టీసీ అధికారుల నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలో ఉద్యమకారులు శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. నల్లబెల్లి మండల కేంద్రం లోనిబస్టాండ్ పరిసరాల్లో ఉన్న మహనీయుల విగ్రహాలను తొలగించేందుకు ఆర్టీసీ డీఎం ఆదేశాలు జారీ చేయడం సమంజసం కాదని నిరసనకారులు పేర్కొన్నారు. మహనీయుల విగ్రహాలు ప్రజలకు స్ఫూర్తినిస్తాయని, వాటిని తొలగించే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు, బీఆర్ఎస్ నాయకులు ఆకుల సాంబరావు, సామాజికవేత్త, బీఆర్ఎస్ నాయకులు , అంబేద్కర్ యువజన సంఘం నాయకులు, నల్లబెల్లి మండల బీఆర్ఎస్ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి గన్నారం అఖిల్, బొమ్మకంటి అనిల్ తదితరులు పాల్గొన్నారు.అంబేద్కర్, స్వామి వివేకానంద విగ్రహాలను తొలగించే నిర్ణయాన్ని అధికారులు తక్షణమే విరమించుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మండలవ్యాప్తంగా వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టి ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు .



మోడల్ స్కూళ్లను పాఠశాల విద్యాశాఖలో విలీనం చేయాలి

ప్రజాపక్షం / మెదక్ : రాష్ట్రంలోని 194 మోడల్ స్కూళ్లను పాఠశాల విద్యాశాఖలో విలీనం చేసి, ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మోడల్ స్కూల్ జాయింట్ యాక్షన్ కమిటీ స్టీరింగ్ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. గత 13 ఏళ్లుగా ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తున్న మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు, ఉద్యోగులు అనేక సర్వీస్, ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు స్టీరింగ్ కమిటీ సభ్యులు బి. కొండయ్య, ఎస్. విఠల్, ఎస్. విఠల్ ఉపాధ్యాయ సంఘాల నాయకులు రాజగోపాల్, కృష్ణ,సాయిలు,



లింగం, శివ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఉద్యోగులకు ప్రభుత్వ ఖాతా పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని, సోషనల్ సర్వీస్, పెండింగ్ బకాయిలు మంజూరు చేయాలని, ఆరోగ్య పథకం అమలు చేయాలని కోరారు. ఖాళీ పోస్టులను భర్తీ చేసి అర్హులకు పదోన్నతులు కల్పించాలని, మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు, ఇతర ప్రయోజనాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సేవలను క్రమబద్ధీకరించాలని, గంటల ప్రాతిపదికన పనిచేసే ఉపాధ్యాయులకు నెలకు కనీసం రూ.35 వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. మోడల్ స్కూళ్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో సుంకరి సాయిలు, ప్రేమ్‌సాగర్, లింగం, రవికుమార్, మురళీధర్‌రావు, పార్థసారధిరావు తదితర ఉపాధ్యాయ సంఘాల నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు టై బెల్టుల పంపిణీ



ప్రజాపక్షం/చేర్యాల: చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలోని ప్రభుత్వ ప్రథమిక పాఠశాల లోని విద్యార్థులకు గ్రామ సర్పంచ్ కొమ్ము రవి ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులు అయోధ్య టై మరియు బెల్టులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొమ్ము రవి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పల్లవి భాస్కర్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అందె నానిబాబు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూమని బాలరాజు, వార్డు సభ్యులు జూపల్లి కార్తీక్ రెడ్డి, అందె లక్ష్మి, స్వర్గం రాజేష్, ఎండీ అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు...దళారులను ఆశ్రయించి నష్టపోవద్దు




ప్రజాపక్షం/గజ్వేల్ : రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటలను ప్రభుత్వ ఐకెపి కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని కొలుగూరు సర్పంచ్ స్వామి స్పష్టం చేశారు. శనివారం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తీవ్ర ఇబ్బందులు పడుతూ వరి ధాన్యాన్ని పండించిన రైతులు నష్టపోవద్దనే లక్ష్యంతో గ్రామంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే సరైన సాగు నీరందక, విద్యుత్ సరఫరా లేక పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతు బాగుంటేనే రాజ్యం బాగుంటుందని, దీనిని ప్రభుత్వం పరిగణలోకి తీసుకొని వెంటనే మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి అన్నదాతలను ఆదుకోవాలని వివరించారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు నిజాంపేట విద్యార్థులు

ప్రజాపక్షం/నిజాంపేట : ఎస్ఎఫ్‌జి రాష్ట్ర స్థాయి నెట్ బాల్ క్రీడా పోటీలకు నిజాంపేట పీఎం శ్రీ విద్యార్థులు ఎంపికయ్యారు. తూప్రాన్‌లో జరిగిన ఉమ్మడి మెదక్ జిల్లా నెట్ బాల్ సెలక్షన్‌లో అండర్ 17 బాలుర విభాగం నుండి శ్రీనివాస్, గణేష్, ఆకాష్ అలాగే బాలికల విభాగం నుండి లావణ్య, ఉజ్మ, అండర్14 బాలుర విభాగం నుండి లోహిత్, లోకేష్, బాలికల విభాగం నుండి శాన్విక ఎంపికయ్యారు. ఎన్నికైన విద్యార్థులు కామారెడ్డి లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పీటి ప్రవీణ్ తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్ఞానమాల విద్యార్థులను అభినందించారు.

వర్గల్ క్షేత్రానికి... పోటెత్తిన భక్తులు

ప్రజాపక్షం/గజ్వేల్ : ప్రసిద్ధ వర్గల్ శనైశ్చరాలయంలో శనివారం శని త్రయోదశి మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా క్షేత్రానికి భక్తులు పోటెత్తగా, ఆలయ వ్యవస్థాపక చైర్మన్, బ్రహ్మశ్రీ, యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నేతృత్వంలో వేద పండితులు మహోత్సవానికి అంకురార్పణ చేశారు. కాగా విశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తులు శనైశ్చర భగవానుడికి తిల, తైలాభిషేకం నిర్వహించగా, కుంభం, మీన, మేష, ధనుస్సు సింహ రాశుల వారు శనైశ్చర భగవానుడికి అత్యంత భక్తి శ్రద్ధలతో అర్చించి తిల తైలాభిషేకం చేశారు. ఆలయ సముదాయానికి తరలివచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు మహాప్రసాదం అందజేయగా, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ముందస్తు



ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి వారిని వేద ంపడితులు విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్యంగా మాస శివరాత్రి విశిష్టతను దృష్టిలో పెట్టుకొని ప్రదోషకాల సమయాన వేద పండితులు స్వామివారికి జలాభిషేకం, పాలాభిషేకం, బిల్వాభిషేకం నిర్వహించారు.

కెసిఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని మహా పాదయాత్ర

ప్రజాపక్షం/నర్సాపూర్ : మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుతూ హత్నూర మండల పరిధిలోని మధుర గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు మహా పాదయాత్ర చేపట్టారు. శనివారం ఉదయం మధుర గ్రామం నుంచి ఈ పాదయాత్ర ప్రారంభమైనది. బీఆర్ఎస్ నాయకులు నర్సింలు, ఉదయ్ కిరణ్ లు ఈ పాదయాత్ర పాల్గొన్నారు. పాదయాత్రలో భాగంగా ముందుగా దౌల్తాబాద్ లోని తెలంగాణ తల్లి, విగ్రహానికీ పూలమాలలు



వేసి నివాళులర్పించి పాదయాత్రగా బయలుదేరారు. అనంతరం నాచారం లోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే తెలంగాణకు మంచి జరుగుతుందని, రైతులు, పేదలు, యువత అందరికీ న్యాయం జరుగుతుందని నాయకులు పేర్కొన్నారు. ఈ పాదయాత్రను కేసీఆర్ ఫామ్ హౌస్ ఎర్రవల్లి వరకు కొనసాగిస్తామని వారు తెలిపిరి, పాదయాత్ర సాగుతున్న మార్గములో గ్రామ గ్రామాన ప్రజలు, కార్యకర్తలు స్వాగతం పలికారు.

ఉద్యమకారుడి తల్లికి ఎర్రోళ్ల శ్రీనివాస్ పరామర్శ

ప్రజాపక్షం/చేర్యాల: చేర్యాల మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధ్యాన కార్యదర్శి, ఉద్యమకారుడు జింకల పర్వతాలు యాదవ్ తల్లి జింకల యాదమ్మ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న మాజీ ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ శనివారం పోతిరెడ్డిపల్లి వెళ్లి యాదమ్మను పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, అధైర్యపడకుండా మనోధైర్యంతో ముందుకు సాగాలని భరోసా కల్పించారు. ఉధ్యమ ప్రస్థానంలో చురకుకైన పాత్ర పోషించిన జింకల పర్వతాలు కుటుంబానికి అండగా నిలుస్తూ ఎర్రోళ్ల శ్రీనివాస్ పరామర్శించడం స్థానికంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కార్యక్ర



మంలో ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ .ఎడ్పీ చైర్మన్ గద్దెల పద్మ నర్సింగరావు, చేర్యాల మున్సిపల్ మాజీ చైర్మన్ అంకుగారి స్వరూప రాణి శ్రీధర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ మంగోలు చంటి, బీఆర్ఎస్ నాయకులు శివగారి అంజయ్య, మాజీ ఎంపిటీసీ బాలరాజు, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, ఉప సర్పంచ్ రాజబాబు, వార్డు సభ్యుడు శ్రీనివాస్, గ్రామ ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు సిద్దిపేట జిల్లా జట్టు సన్నద్ధం

ప్రజాపక్షం/కొండపాక : 36వ సబ్‌జూనియర్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనే సిద్దిపేట జిల్లా జట్టుకు దుద్దెడ కబడ్డీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ శిబిరాన్ని రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ సందర్శించి క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా దేవి రవీందర్ మాట్లాడుతూ, కబడ్డీ గ్రామీణ సంప్రదాయ క్రీడ అని, శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తుందని అన్నారు. చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. కబడ్డీని ప్రోత్సహిస్తున్న బృందాన్ని అభినందించారు. నవంబర్ 12 నుంచి 14 వరకు వికారాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు ప్రసాద్, కబడ్డీ అసోసియేషన్ కోశాధికారి సత్యం, జాయింట్ సెక్రటరీలు శ్రీకాంత్, చిన్న నర్సు, కరుణాకర్, క్లబ్ ప్రధాన కార్యదర్శి రోషిలి కిషన్, కోచ్ సంపత్, వార్డు సభ్యుడు కందుగుల కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



దీపావళి వెలుగులు ప్రతి ఇంటా సంతోషాలతో వెలగాలి



ప్రజాపక్షం / మెదక్ : చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని మాజీ ఉపసభాపతి, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి ఆకాంక్షించారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని మెదక్ జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. దీపాల కాంతులతో ప్రతి ఇల్లు ప్రకాశించాలని, ప్రతి కుటుంబంలో ఆనందం, ఆప్యాయతలు వెల్లివిరియాలని కోరుకున్నారు. ముఖ్యంగా టపాసులు కాల్చే సమయంలో చిన్నపిల్లల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారి పర్యవేక్షణలోనే బాణాసంచా కాల్చేలా చూడాలని కోరారు. ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ సురక్షితమైన దీపావళిని జరుపుకోవాలని సూచించారు. జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

మండల ఎస్సి సెల్ అధ్యక్షుడిగా శ్రీనివాస్ ఏకగ్రీవ ఎన్నిక



ప్రజాపక్షం/నిజాంపేట : నిజాంపేట మండల ఎస్సీ సెల్ అధ్యక్షునిగా మద్దికుంట శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం మెదక్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉండి నాకు బాధ్యతలు అప్పటించి నందున తన ఎంపికకు సహకరించిన ఎమ్మెల్యే రోహిత్ రావుకు, ప్రజా ప్రతినిధులకు, ముఖ్య నాయకులకు, కార్యకర్తలకు రుణపడి ఉంటానన్నారు. కాంగ్రెస్ పార్టీ ఏ కార్యక్రమం ఇచ్చిన తన భుజస్కందాలపై వేసుకొని పనిచేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎల్ జిల్లా అధ్యక్షుడు తాడేపు మహేందర్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు భాను ప్రకాష్ రెడ్డి, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి రంగా రాజకీషన్ తదితరులు పాల్గొన్నారు.

సంతాన మల్లికార్జు స్వామికి వైభవంగా అన్నపూజ



ప్రజాపక్షం/కొండపాక : కొండపాక మండలం మర్పడగ గ్రామంలోని శ్రీవిజయ దుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామికి మాస శివరాత్రిని పురస్కరించుకొని అన్నాభిషేకాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సంతాన మల్లికార్జున స్వామికి, శ్రీ విజయ దుర్గా మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత క్షేత్ర నిర్వాహకులు చెప్పెల హరినాథశర్మ ఆధ్వర్యంలో ఉదయం 630 గంటలకు గణపతి పూజతో కార్యక్రమం ప్రారంభం కాగా అర్చకులు రుద్రపారాయణం, శ్రీసూక్త పారాయణం చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర నిర్వహణా కమిటీ సభ్యులు మర్యాల రవీందర్, సురేందర్ రెడ్డి, గట్టు విఠల్, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు అన్నప్రాసన



ప్రజాపక్షం/శివ్వంపేట : మండలంలోని లింగోజిగూడ అంగన్‌వాడీ కేంద్రంలో సామాజిక వేడుకల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ సంతోష, సర్పంచ్ అమృతఅశోక్‌గౌడ్‌లతో కలసి చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో సామాజిక వేడుకలు నిర్వహించడం ద్వారా పిల్లల ఎదుగుదల, ఆరోగ్య పరిరక్షణపై తల్లులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. పిల్లల పరిస్థితిని ఎప్పటికప్పుడు తల్లులు పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహిపాల్, అంగన్‌వాడీ టీచర్ కవిత, సిబ్బంది ఉన్నారు.

నీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు



ప్రజాపక్షం/చేర్యాల : భవిష్యత్తులో తలెత్తే నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకొని పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా చేర్యాల పట్టణకేంద్రంలోని 2వ వార్డులో మున్సిపాల్ చైర్మన్ ముత్యాల అరుణ బాల నర్సయ్య, వైస్ చైర్మన్ మేడిశెట్టి ఉమా శ్రీధర్ ఆధ్వర్యంలో బోరు వేయించి మోటరును బిగించారు. ప్రజల నీటి అవసరాలను గుర్తించి ముందస్తుగా ఈ చర్యలు చేపట్టడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాలకు మున్సిపల్ స్థానిక కౌన్సిలర్ కమలాపురం గీతాంజలి, పట్టణ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దీపావళి కానుకలు



ప్రజాపక్షం/నిజాంపేట్ : దీపావళి పండుగ సందర్భంగా నస్కల్ గ్రామానికి చెందిన లక్ష్మి, కాశయ్యల జ్ఞాపకార్థం వారి కుమారులు శ్రీనివాస్, శ్రీకాంత్, వార్డు సభ్యుడితో కలిసి గ్రామంలోని ఆరుగురు పరిశుద్ధ కార్మికులకు నూతన వస్త్రాలు, పండుగ సామగ్రితో పాటు ఓక్కొక్కరికి రూ 500 చొప్పున నగదు అందజేశారు. తమ సొంత ఖర్చులతో కార్మికులకు పండుగ కానుకలు అందించడం పట్ల పలువురు అభినందించారు. ఈ సందర్భంగా కార్మికులు శ్రీనివాస్, శ్రీకాంత్‌లను శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మమత, ఎఫ్‌పీఓ చైర్మన్ నాతి లక్ష్మా గౌడ్, కార్మికులు ఎల్లవ్వ, పోశవ్వ, జమున, ఎల్లయ్య, నర్సింలు, ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా కట్ట దావీద్

ప్రజాపక్షం/పాపన్నపేట : పాపన్నపేట మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా కట్ట దావీద్‌ను నియమిస్తూ డీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ తాడేపు మహేందర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మండల పరిధిలోని మిన్పూర్ గ్రామానికి చెందిన దావీద్ అనాదిగా కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. నమ్మకంతో పార్టీ పదవి అప్పగించిన చైర్మన్ తాడేపు మహేందర్, ఎమ్మెల్యే రోహిత్ రావు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, డిసిసి అధ్యక్షులు అంజనేయులు గౌడ్, పాపన్నపేట మండల అధ్యక్షులు నరేందర్ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పద్మశాలి సంఘ భవనం జోలికొస్తే ఉపేక్షించేది లేదు



ప్రజాపక్షం/గజ్వేల్ : ప్రసిద్ధ నాచగిరి క్షేత్రం లోని పద్మశాలి సంఘ భవనం జోలికొస్తే ఎంత మాత్రం సహించమని రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ గూడూరు శ్రీనివాస్, ప్రముఖ న్యాయవాదులు రాజు, ఖాళీ ప్రసాద్, మాజీ మున్సిపల్ చైర్మన్ భాస్కర్, పద్మశాలి సహకార సంఘం అధ్యక్షులు రాజేశం, పద్మశాలి సంఘం అధ్యక్షులు దేవదాసు, మాజీ అధ్యక్షులు దుర్గా ప్రసాద్, గాడిపల్లి శ్రీనివాస్ హెచ్చరించారు. శనివారం సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం నాచగిరిలోని అఖిల భారత పద్మశాలి నిత్యాన్న సత్ర సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. పద్మశాలీ సమాజం విభేదాలు పక్కనబెట్టి ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉందని చెప్పారు. సాక్షాత్తు పోలీసుల ముందే సిబ్బంది పట్ల దౌర్జన్యంగా వ్యవహరించగా, ప్రజలకు రక్షణ ఇవ్వాల్సిన పోలీసులు పట్టించుకోకపోవడం తగదని నిలదీశారు. సమాజ శ్రేయస్సును కాపాడుకుంటూ, పద్మశాలీల ఆస్తులు, హక్కుల కోసం కలిసి కట్టుగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. నాచగిరి అఖిలభారత పద్మశాలి సంఘ భవనంపై దాడి సంఘటనను సీఎం రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రుల దృష్టికి తీసుకెళ్తామని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన విభాగం అధ్యక్షులు అనూప్, నేతలు సబ్బని నరేష్, బాలచంద్రం, రాజేశం, నాగభూషణం, నేత నాగరాజు, శ్రీనివాస్, వెంకటేష్, బాల రాజు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కెసిఆర్ మళ్లీ సిఎం కావాలని పాదయాత్ర



ప్రజాపక్షం/శివ్వంపేట : తెలంగాణ సీఎంగా మళ్లీ కేసీఆర్ కావాలని కోరుతూ హత్నూర మండలం మాధుర గ్రామ నుంచి బీఆర్ఎస్ నాయకులు పాదయాత్ర నిర్వహించడం జరిగింది. మాధుర ఉపసర్పంచ్ సువరణనర్సింలు, గ్రామకమిటి అధ్యక్షులు పాలంచ ఉదయ్‌కిరణ్ శివ్వంపేట మండలం చిన్నగొట్టిముక్ల, శివ్వంపేట మీదుగా కొనసాగింది. ఈ సందర్భంగా శివ్వంపేట బీఆర్ఎస్ అధ్యక్షులు రమణాగౌడ్ ఆధ్వర్యంలో గూడురు సర్పంచ్ బేగరి నర్సయ్య, ఉపసర్పంచ్ కొత్తపేట వెంటేష్‌గౌడ్‌లు వారికి స్వాగతం పలికి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా మాధుర గ్రామ కమిటి అధ్యక్షులు ఉదయ్‌కిరణ్ మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వ హాయంలో రైతులను రాజును చేస్తే నేటి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను రోడ్డుమీదకి తెచ్చిందని ధ్వజమెత్తారు. నాణ్యమైన కరెంట్ ఇవ్వకపోవడంతో పంటలు ఎండి దిక్కు తోచని పరిస్థితి నెలకొందన్నారు. ప్రజలంతా కేసీఆర్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని, మళ్లీ సీఎం కేసీఆర్ కావడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో శేరిపల్లి నరేందర్, బొట్టు సత్తయ్య తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



ప్రజాపక్షం/కొండపాక : కొండపాక మండల పరిధిలోని దర్గా, రాంపల్లి, గిరాయిపల్లి, రవీంద్రనగర్ గ్రామాల్లో ఖరీఫ్ 202627 వానాకాలం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏఎంసీ చైర్మన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మంచాల కనకరాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని పూర్తిగా ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,461, బి గ్రేడ్‌కు రూ.2,441 మద్దతు ధర ప్రకటించిందని, ప్రభుత్వం గుర్తించిన సన్న రకాల ధాన్యానికి అదనంగా రూ.500 బోనస్ అందిస్తుందని తెలిపారు. రైతులు దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దని, టోకెన్ల ప్రకారం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ బట్టా పరశురాములు, జిల్లా కాంగ్రెస్ నాయకులు నరేందర్, వానరి లింగారావు, గజవెల్లి సుదర్శన్, సర్పంచులు కొయ్యడ వెంకటేశం, కొలుపుల గంగాధర్, తేలు సుజాత, మల్లయ్య, గ్రామ నాయకులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మహిళా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

ప్రజాపక్షం/పాపన్నపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేసే అవకాశం కల్పించిందని, ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని అదనపు కలెక్టర్ నగేష్ సూచించారు. శనివారం మండల పరిధిలోని కుర్తివాడ గ్రామాన్ని సందర్శించిన ఆయన ముందుగా గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఇళ్ల నిర్మాణాల పురోగతిని, పనుల స్థితిగతులను పరిశీలించి సంబంధిత వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా లబ్ధిదారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభకు ప్రశంసలు

అనంతరం గ్రామంలోని పాఠశాలను సందర్శించిన అదనపు కలెక్టర్ నగేష్, కరాటేలో ప్రతిభ కనబరిచి వివిధ స్థాయిల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించిన విద్యార్థులకు బెల్ట్‌లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ వారిని ప్రోత్సహించారు. చదువుతోపాటు క్రీడలు, మార్షల్ ఆర్ట్స్‌లోనూ విద్యార్థులు రాణించాలని ఆకాంక్షించారు. ఆయన వెంట సర్పంచుల ఫోరం జిల్లా ఉపాధ్యక్షులు శ్రీధర్, తహసీల్దార్ సతీష్, కరాటే మాస్టర్ మణి, వార్డు సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు లోక్యానాయక్ తదితరులు ఉన్నారు.

19న జరిగే సిఎం బహిరంగ సభను విజయవంతం చేయాలి

-గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం

ప్రజాపక్షం/ సిద్దిపేట : ఈ నెల 19న సిద్దిపేట జిల్లా కేంద్రంలో సిఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలని సిద్దిపేట గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం అన్నారు. సిద్దిపేట వేదిక నుండి ఇందిరమ్మ బీమా, ఇందిరమ్మ చీరల పంపిణి కార్యక్రమం ప్రారంభించనున్నట్లు తెలిపారు. శనివారం బహిరంగ సభ వేదికను నియోజకవర్గం కాంగ్రెస్ నేతలు బుస్సాపూర్ మాజీ సర్పంచ్ సదాశివ రెడ్డి, మంద పాండు, నిజాముద్దీన్, మాజీ కౌన్సిలర్ బుచ్చి రెడ్డిలతో కలిసి స్థల పరిశీలన చేశారు. పత్తి మార్కెట్ యార్డ్ అందరికి అందుబాటులో ఉంటుందన్నారు. సిద్దిపేట కి ఈశాన్యం వైపు ఉంటూ ఎన్నో సభల విజయానికి కారణం అయిందన్నారు. దాదాపు 12 నుండి 15 ఎకరాల వరకు ఉన్న ఈ స్థలం అటు కరీంనగర్ హుస్నాబాద్ గజ్వేల్ దుబ్బాక నుండి వచ్చే వారికి కూడా ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా నేరుగా సభ స్థలి కి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. పార్కింగ్ కోసం నాలుగు స్థలాలను పరిశీలించడం జరిగిందన్నారు. పార్కింగ్ సభ స్థలి నుండి కేవలం కిలోమీటర్ మాత్రమే ఉంటుంది. వివిధ నియోజక వర్గాల నుండి, మండలాల నుండి వచ్చే వారికి విడివిడిగా పార్కింగ్ కి



స్థలాలు అందుబాటులో ఉన్నాయి . మంత్రుల దృష్టికి కూడా ఈ విషయం తీసుకువెళ్తాము అని అన్నారు. ఈ కార్యక్రమంలో కోదండరావుపల్లి సర్పంచ్ వంగపల్లి అశోక్,బాబు, బింగి యాదగిరి, శ్రీనివాస్, గోపులపూర్ దేవయ్య అన్నారు.

ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తహసీల్దార్ మల్లయ్య



ప్రజాపక్షం/అల్లాదుర్గం : దీపావళి పర్వదినం సందర్భంగా మండల ప్రజలందరికీ తహసీల్దార్ మల్లయ్య హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకే దీపావళి పండగ అన్నారు. చీకటిని పారద్రోలి వెలుగులను పంచే ఈ పండుగ ప్రతి కుటుంబంలో ఆనందం, ఆరోగ్యం, శాంతి, సౌభాగ్యాలను తీసుకురావాలని ఆకాంక్షించారు.పండుగను అందరూ సంతోషంగా, సురక్షితంగా, పర్యావరణ హితంగా జరుపుకోవాలని కోరారు. పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకొని తక్కువ కాలుష్యం వెదజల్లే టపాసులను కాల్చాలని తోడుగా తగు జాగ్రత్తలు పాటించాలని, ముఖ్యంగా పిల్లలు, వృద్ధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి ఇంట్లో దీపాల వెలుగులతో పాటు ప్రతి మనసులోనూ ప్రేమ, స్నేహం వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు.

పోలీసు కమిషనర్ రశ్మీ చేతుల మీదుగా ప్రథమ బహుమతి అందుకున్న సతీష్



ప్రజాపక్షం/ సిద్దిపేట : పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనరేట్ నిర్వహించిన ఫోటోగ్రఫీ పోటీలో ఫొటో జర్నలిస్ట్ కె.సతీష్ ప్రథమ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా శనివారం సిద్దిపేటలోని జిల్లా పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా పోలీస్ కమీషనర్ రష్మి పెరుమాళ్ అవార్డు గ్రహీత కె.సతీష్ ను అభినందించి శాలువాతో సత్కరించి, మెమెంటో అందజేశారు. విధి నిర్వహణలో పోలీసుల సేవలను కళ్లకు కట్టినట్లుగా చిత్రీకరించినందుకు గాను కె.సతీష్ కు ఈ పురస్కారం దక్కింది. ఫోటో జర్నలిస్టు సతీష్ ప్రథమ బహుమతి సాధించటం పట్ల పలువురు జర్నలిస్టులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

టాయిలెట్లు లేక విద్యార్థుల అవస్థలు.. అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం.!



ప్రజాపక్షం / కొల్చారం : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో టాయిలెట్లు అందుబాటులో లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత మూడు నెలలుగా కాలకృత్యాల కోసం సుమారు అర కిలోమీటరు దూరం వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో విద్యార్థుల చదువుకు ఆటంకం కలుగుతున్నా సంబంధిత అధికారుల్లో చలనం లేకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కళాశాల మరమ్మతుల కోసం ఇంటర్ బోర్డు రూ.24 లక్షలు మంజూరు చేసినప్పటికీ పనులు ఇంకా పూర్తికాకపోవడం కాంట్రాక్టర్ పనితీరుపై అనుమానాలు రేకెత్తిస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పనులు వేగవంతం చేసి టాయిలెట్లను అందుబాటులోకి తేవాలని విద్యార్థులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

జిల్లా సబ్ జూనియర్ బాలుర కబడ్డీ జట్టు ఎంపికలు

ప్రజాపక్షం / మెదక్ : 36వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలుర అంతర్ జిల్లా కబడ్డీ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే మెదక్ జిల్లా జట్టు ఎంపికలు ఈ నెల 9వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు మెదక్ పట్టణంలోని గుల్షన్ క్లబ్‌లో నిర్వహించనున్నారు. ఈ ఎంపికలకు 17 సంవత్సరాలలోపు వయస్సు, 60 కిలోల లోపు బరువు కలిగిన బాలురు అర్హులు. 13 122010 లేదా ఆ తర్వాత జన్మించిన వారు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, పదో తరగతి మెమోతో హాజరుకావాలని జిల్లా కబడ్డీ బాధ్యులు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు నవంబర్ 12 నుంచి 14 వరకు వికారాబాద్ లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో మెదక్ జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని జిల్లా కబడ్డీ అసోసియేషన్ తాత్కాలిక కమిటీ చైర్మన్ ఎల్లన్న, కన్వీనర్ శివకుమార్, జిల్లా బాధ్యులు రవి తెలిపారు. అర్హులైన క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

సిఎం రేవంత్‌రెడ్డి సిద్దిపేటకు మూడు సార్లు కాదు..ముప్పైసార్లు వచ్చినా చేసేది ఏమిలేదు



ప్రజాపక్షం/ సిద్దిపేట : సిద్దిపేటకు మూడు సార్లు కాదు ముప్పై సార్లు వచ్చిన నువ్వు చేసేది ఎం లేదని రేవంత్ రెడ్డిని మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు ఘాటుగా విమర్శించారు. గతంలో సిద్దిపేటకు వచ్చి రుణ మాఫీ చేస్తానని, 45 రోజుల్లో రైతు బందు వేస్తా అని మోసం చేసావని ప్రజలు నమ్మె స్థితిలో లేరన్నారు. ఉద్యమాల ...త్యాగాల చరిత్ర మాది...నాడు తెలంగాణ కోసం పదవులను గడ్డి పోచల తృణ ప్రాయంగా విడిచిపెట్టామన్నారు. రేవంత్ రెడ్డి సిద్దిపేట కు వస్తే ప్రజలకు క్షమాపణ చెప్పి రావాలని మాజీ మంత్రి హరీష్‌రావు సూచించారు. శనివారం సిద్దిపేట క్యాంపుకార్యాలయంలో బిఆర్ఎస్ విద్యార్థి విభాగం నూతన కమిటీల సన్మాన కార్యక్రమంలో మాజీ మంత్రి హరీష్‌రావు పాల్గొని మాట్లాడారు. సిద్దిపేట నియోజకవర్గంలో మూడేళ్లలో అడుగు అభివృద్ధి పని జరగలేదన్నారు. సిద్దిపేట మంజూరు అయిన వెటర్నరీ కళాశాల తెచ్చి సిద్దిపేట కు తిరిగి తీసుకరావాలన్నారు. సిద్దిపేట అయిల్ ఫామ్ చుసి కొడంగల్ లో కట్టుకుంటున్నారన్నారు. సిద్దిపేట లో కొత్త పనులు ఇచ్చింది లేదని,.పాతవి పనులు చేసింది లేదన్నారు. ఆపిన పనులు ప్రారంభం చేసి సిద్దిపేట కు రావాలన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం... రేవంత్ రెడ్డి వచ్చాక అన్ని ఎగొట్టాడన్నారు. ఎగవేతల రేవంత్ రెడ్డి అంటే..కేసులు పెట్టాడు.. ఎన్ని కేసులు పెట్టిన నిన్ను ప్రశ్నిస్తుంచడం ఆగేది లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బిజేపీ తప్పుడు ప్రచారాలని దీటుగా సోషల్ మీడియా లో తిప్పికొట్టాలని విద్యార్థులకు సూచించారు. వచ్చేది మన కెసిఆర్, మన బిఆర్ ఎస్ ప్రభుత్వనన్నారు. సిద్దిపేట ప్రగతి ని పరుగులు పెట్టించే బాధ్యత నాదన్నారు. తుది శ్వాస వరకు మీ సేవలో ఉంటాను. మీ సేవలో అనునిత్యం అందుబాటులో మన క్యాంప్ ఆఫీస్ ఉంటుంద న్నారు. మీ సమస్యలను ఏదైన తనదృష్టికి తెచ్చిన వెంటనే సత్వర పరిష్కారానికి కృషిచేస్తానని హామీ నిచ్చారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు దువ్వల మల్లయ్య, పాల సాయిరాం, అరవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దీపావళి వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

ప్రజాపక్షం/గూడూరు; దీపావళి పండుగను గూడూరు మండల ప్రజలందరూ ఆనందోత్సాహాలతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని గూడూరు ఎస్ఐ రమేష్ బాబు సూచించారు.ఈసందర్భంగా ఆయన ప్రజాపక్షంతో మాట్లాడుతూ దీపావళి పండుగను పురస్కరించుకుని మండలంలో టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు సంబంధిత శాఖల నుంచి తప్పనిసరిగా అనుమతులు లైసెన్సులు పోందాలని తెలిపారు. పండుగ సమయంలో ప్రజల రాకపోకలకు అంతరాయం కలగకుండా దుకాణాల నిర్వహణ చేపట్టాలని భద్రకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. పండుగ వేళ ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తూ పోలీసులకు సహకరించాలని చిన్నపిల్లలు టపాసులు కాల్చే సమయంలో తల్లిదండ్రులు తగిన పర్యవేక్షణ ఉండేలా చూసుకోవాలని ఎస్ఐ రమేష్ బాబు కోరారు. ప్రజలందరి సహకారంతో దీపావళి పండుగను సంతోషంగా సురక్షితంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

కార్మిక హక్కుల పరిరక్షణకు కమ్యూనిస్టుల ఐక్యత అవసరం



ప్రజాపక్షం/గూడూరు; కార్మికులు కర్షకుల హక్కులను కాపాడుకోవాలంటే కమ్యూనిస్టులంతా సైద్ధాంతిక విభేదాలను పక్కనపెట్టి ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని ఎంసిపిఐ(యు) కేంద్ర కమిటి సభ్యుడు పానుగంటి నర్సయ్య పిలుపునిచ్చారు. శనివారం నర్సయ్య అధ్యక్షతన జరిగిన ఎంసిపిఐ(యు) పార్టీ కార్యకర్తల సమావేశం లో నర్సయ్య మాట్లాడుతూ ప్రపంచ చరిత్రలో శ్రామిక వర్గం తొలిసారిగా దోపిడి వర్గాలపై పోరాడి రష్యాలో అధికారాన్ని సాధించిందని ఆ విప్లవ స్ఫూర్తి ప్రపంచంలోని అనేక దేశాల్లో ప్రజా ఉద్యమాలకు మార్గం చూపిందని అన్నారు. చైనా వియత్నాం క్యూబా కొరియా కంబోడియా లావోస్‌తో పాటు లాటిన్ అమెరికా దేశాల్లో నూ ప్రజలు దోపిడికి వ్యతిరేకంగా ఉద్యమించి తమ హక్కుల కోసం పోరాడాలని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో భానోత్ లాలు గుగులోత్ భిక్షం బానోత్ బాలు చదువాల నర్సయ్య కార్యకర్తలు ఎత్తున పాల్గొన్నారు.

తిప్పారంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

దళారుల నమ్మి మోసపోవద్దు.
తిప్పారం సర్పంచ్ భద్రప్ప



ప్రజాపక్షం/కొండపాక (కుక్కునూరు పల్లి) : రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచుల ఫోరం అధ్యక్షుడు, తిప్పారం సర్పంచ్ ఆకుల భద్రప్ప సూచించారు. శనివారం కుక్కునూరు పల్లి మండలం తిప్పారం గ్రామంలో సర్పంచ్ ఆకుల భద్రప్ప ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ వీరుపాక శ్రీనివాస్ రెడ్డి, ఏపీఎం నిర్మల, ఐకేపీ సిబ్బంది, వార్డు సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

చదువుకున్న పాఠశాలకే హెచ్ఎంగా..మిత్రుడుకి ఘన సన్మానం



ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట : చదువుకున్న పాఠశాలలోనే తమ మిత్రుడు ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు చేపట్టడం పూర్వ విద్యార్థుల్లో ఆనందాన్ని నింపింది. ధూల్మిట్ట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1992 ఎస్ఎస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు తమసహచరుడు చిలుక వెంకటయ్య ప్రధానోపాధ్యాయులుగా మరియు కాంప్లెక్స్ ఎచ్ఎంగా బాధ్యతలు స్వీకరించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ ఘనంగా ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. అలాగే రిటైర్డ్ తీసుకున్న ప్రధానోపాధ్యాయులు అనుముల కర్ణాకర్ రెడ్డిని, ధూల్మిట్ట మండల నూతన విద్యాశాఖ అధికారిగా (ఎంఈఓ) పి.కోటయ్యను సైతం ఆత్మీయంగా సత్కరించారు. ఒక్కపుడు ఆదే పాఠశాలలో కలసి చదువుకున్న తమ మిత్రుడు, అదే పాఠశాలకు రావడం ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు స్వీకరిం పట్ల గర్వంగా, ఎంతో సంతోషంగా ఉందని 1992 బాచ్ మిత్రులు భావోద్వేగం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రిటైర్డ్, ప్రస్తుత ఎంఈఓలు అనుముల కర్ణాకర్ రెడ్డి, పి.కోటయ్యలు పూర్వ విద్యార్థులను అభినందిస్తూ, పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని కోరారు.

మళ్లీ విద్యార్థులుగా మారి .. పాత జ్ఞాపకాల్లోకి!

చదువుకున్న పాఠశాలలో ఈ ఆత్మీక కలయికతో ప్రత్యేక ఆకర్షణగా 1992 ఎస్ఎస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులంతా తాము చదువుకున్న తరగతిగదిలోకి వెళ్లి చిన్ననాటి విద్యార్థుల్లా బెంచీలపై కూర్చున్నారు. ఒకరినొకరు పలకరించుకుంటూ, ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందంగా గడిపారు. దశాబ్దాలు గడిచిన చెదరని స్నేహ బంధం తమదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 1992 బ్యాచ్ సభ్యులు గునుకుల జగన్‌మోహన్ రెడ్డి, కొలుపుల రాములు, నాచగోని రాజలింగం, తాళ్లపల్లి భిక్షపతి, దాసరి నర్సింహులు, గిరి సురేందర్ రెడ్డి, కొల సత్తయ్య, కనుకలింగం, ఉపేందర్, కనుకయ్య, ప్రభకార్, ముంగి శ్రీనివాస్, కనుకాంబరం, గణేష్, శ్రీనివాస్, యాదగిరి పాల్గొన్నారు.

జనగామ ఆర్‌టిసి డిపోలో కండక్టర్ నిర్లక్ష్యం

ప్రజాపక్షం /జనగామ : జనగామ ఆర్‌టిసి డిపోలో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఓ కండక్టర్ పదిహేను రోజులుగా ప్రయాణికుల నుండి వసూలు చేసిన డబ్బులు, టిమ్ దగ్గర పెట్టుకొని విధులకు గైర్హాజర్ అయినా పట్టించుకోలేదు. ఆయన వచ్చి డబ్బులు చెల్లించిన మరుక్షణమే యదావిధిగా విధులకు అనుమతించారు. ఈ విషయమైన కార్మికుల్లో చర్చ జరుగుతుంది. పూర్తి వివరాల్ని పరిశీలిస్తే..జనగామ ఆర్‌టిసి డిపోకు చెందిన వెంకటేష్ అనే కండక్టర్ గత నెల 19వ తేదీన సిద్దిపేటకు నైట్‌హాల్ట్ డ్యూటిపై వెళ్లారు. మరుసటి రోజు డిపోలో డబ్బులు చెల్లించి టిప్ అప్పగించాల్సి ఉండగా డబ్బులు, టిమ్ ఇవ్వకుండానే పదిహేను రోజులు నవంబర్ 03వ తేదీ వరకు విధులకు హాజరుకాలేదు. 3వ తేదీన డిపోకు వచ్చి డబ్బులు చెల్లించడంతో పాటు టిమ్ అప్పగించగా ఆయనను డ్యూటికి పంపించారు. ఈ విషయంలో సిస్టమ్ సూపర్‌వైజర్, డిసి నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తెలుస్తుంది. వెంకటేష్ 3వ తేదీ డ్యూటికి వెళ్లి వచ్చిన తరువాత ఏం జరుగుతుందో అన్న భయంతో అధికారులు ఆయనకు విధులకు హాజరు కావొద్దని చెప్పారు. అయితే ఒక కండక్టర్ 15 రోజుల పాటు ప్రయాణికుల నుండి వసూలు చేసిన డబ్బులు, టిమ్ దగ్గర పెట్టుకున్నా చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డిపో మేనేజర్ తీవ్ర నిర్లక్ష్యంగా మూలంగా ఇది జరిగినట్లు తెలుస్తుంది. ఒక మహిళా కండక్టర్‌కు ఏకంగా తొమ్మిది రోజుల పాటు సెలవు ఇవ్వడంపైనా కూడా కార్మికుల్లో చర్చ జరుగుతుంది. డిఎం, డిసి, సిఐలు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు కొందరికి అనుకూలంగా, కొందరికి వ్యతిరేకంగా వ్యవహరిస్తుండడంతో కార్మికులు ఆందోళనకు సైతం సిద్ధం అవుతున్నట్లు సమాచారం.

ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు

మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



ప్రజాపక్షం / మెదక్ : మెదక్ జిల్లా ప్రజలందరికీ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి, చీకటిపై వెలుగు సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దీపావళి పండుగను ప్రజలందరూ ఆనందోత్సాహాలతో, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని అధిక శబ్దం, వాయు కాలుష్యానికి కారణమయ్యే టపాసులకు దూరంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా చిన్నారులు టపాసులు కాల్చే సమయంలో తల్లిదండ్రులు, పెద్దలు తప్పనిసరిగా పర్యవేక్షించాలని, తగిన జాగ్రత్తలు పాటిస్తూ ప్రమాదాలకు తావులేకుండా చూసుకోవాలని తెలిపారు. దీపావళి పర్వదినం జిల్లా ప్రజలందరి ఇళ్లలో సిరిసంపదలు, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు వెల్లివిరియాలని, ప్రతి కుటుంబం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

స్కూల్‌ల్లో వరుస ఘటనలతో విశ్వాసాన్ని కోల్పోతున్న ప్రజలు..

ప్రజాపక్షం/బెజ్జంకి : మండల పరిధిలోని ఎల్లంపల్లి శివారులోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో చోటు చేసుకుంటున్న వరుస ఘటనలతో రోజురోజుకు మండల ప్రజలు పాఠశాలపై విశ్వాసాన్ని కోల్పోతున్నారని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) మండల కార్యదర్శి దొంతరవేణి మహేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో వారు మాట్లడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతీష్టాత్మకంగా ఏర్పాటు చేసిన మోడల్ స్కూళ్ళపై పేద మద్య తరగతి కుటుంబాలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని అన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకోని వరుస ఘటనలపై క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టి భాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకొని పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయ సిబ్బందిని తొలగించి నూతన సిబ్బందిని నియమించాలని కోరారు. లేని యెడలా విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

నాణ్యమైన మాంసాన్ని విక్రయించాలి



ప్రజాపక్షం/శివ్వంపేట: కొనుగోలు దారులకు నాణ్యమైన మాంసాన్ని అందించాలని ఇంచార్జ్ మండల పశువైద్యాధికారిని ఫాతిమా, సర్పంచ్ రాజిపేట వెంకటేశ్వర్‌లు అన్నారు. శనివారం శివ్వంపేటలోని చికెన్, మటన్ దుకాణాల నిర్వహణ తీరును పరిశీలించారు. దుకాణాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిర్లక్ష్యం వహించిన దుకాణాదారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమాదేవి, గ్రామశాఖ అధ్యక్షులు ముద్దగల్ల లక్ష్మి నర్సయ్య, వార్డుసభ్యులు కమలయ్యగారి మల్లీశ్వరినర్సింలు, తదితరులు ఉన్నారు.

జిల్లా స్థాయి విజ్ఞాన సదస్సులో గుమ్మడి దోడ్డి విద్యార్థుల ప్రతిభ

ప్రజాపక్షం/వాజేడు: 32 వ బాలల విజ్ఞాన సదస్సు 2026 జిల్లా స్థాయి పోటీల్లో మండలంలోని గుమ్మడిదొడ్డి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ద్వితీయ బహుమతి సాధించారు. అంతేకాకుండా జూనియర్ విభాగంలో రష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై పాఠశాలకు, మండలానికి గర్వకారణంగా నిలిచారు. పాఠశాలకు చెందిన ఎం. హర్షవర్ధన్, ఎం. జీవన్ తేజ రూపొందించిన 'మురుగు నీటితో పచ్చని తోట' అనే విజ్ఞాన ప్రదర్శన న్యాయనిర్ణేతలను విశేషంగా ఆకట్టుకుంది. నీటి వృథాను అరికట్టడం, వాడిన నీటిని తిరిగి వినియోగించుకోవడం, పర్యావరణ పరిరక్షణ అంశాలతో రూపొందించిన ఈ వినూత్న ప్రయోగం ప్రశంసలు అందుకుంది. ఉపాధ్యాయుడు డి. నాగార్జున మార్గదర్శకత్వంలో విద్యార్థులు ఈ ప్రాజెక్టును రూపొందించి ప్రదర్శించారు. విద్యార్థుల ప్రతిభను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గిరిప్రసాద్, స్థానిక రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ఇదే ప్రతిభను కనబరిచి విజయం సాధించాలని ఆకాంక్షించారు.